ముడా అధికారులకు తాఖీదులు

మైసూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి, ఇతరులకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన వివరాలు అందించాలంటూ ముడా అధికారులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావ మరిది మల్లికార్జున స్వామి, భూమిని విక్రయించిన దేవరాజ్‌లపై లోకాయుక్తలో కేసు నమోదైంది. దసరా వేడుకల అనంతరం దర్యాప్తును వేగవంతం చేస్తామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఈడీ రంగప్రవేశం చేసి, ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు

ఇద్దరు నేతలపై తేనెవల?

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : కర్ణాటకకు చెందిన ఇద్దరు మాజీ ముఖ్యమంత్రు (భాజపా)లపై ఆ పార్టీకే చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే ఒకరు హనీట్రాప్‌లో ఇరికించారని అత్యాచార బాధితురాలు ఆరోపించింది. తనకు పోలీసు భద్రత కల్పిస్తే ఆ మాజీ ముఖ్యమంత్రులు ఎవరో పేర్లు, ఇతర ఆధారాలను బయట పెడతానని వెల్లడించింది. తనను కలుసుకున్న కొందరు విలేకరులతో ఆమె బుధవారం బెంగళూరులో మాట్లాడారు. ప్రచార మాధ్యమాల వద్ద ఉన్న రహస్య కెమెరాల కన్నా అధునాతనమైన కెమెరాలు ఆ ఎమ్మెల్యే వద్ద ఉన్నాయని వివరించింది. దాన్ని ఉపయోగించుకుని కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, మాజీ ముఖ్యమంత్రులను తేనెవలలో ఇరికించారని వివరించింది. తాను అన్ని వైద్య పరీక్షలు, లైడిటెక్టర్ పరీక్షలకు సిద్ధమని ప్రకటించింది. పలువురు కథానాయికలు, రూపదర్శులను ఈ హనీట్రాప్‌కు ఆయన వాడుకున్నారని ఆరోపించింది. భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర తనకు పది నిమిషాల సమయం ఇస్తే అన్ని దాఖాలూ ఆయనకు అందిస్తానని ప్రకటించింది.

మార్పుతో పెనుముప్పు

డీకే, సతీశ్ వ్యాఖ్యలతో తొలగిన ఉత్కంఠ

ఈనాడు, బెంగళూరు : ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై నమోదైన మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)అక్రమాల కేసులు మెడపై కత్తిలా వేలాడుతున్నాయి. ఓ వైపు లోకాయుక్త, ఈడీలు ముమ్మరంగా దర్యాప్తు చేపడుతున్నాయి. ప్రస్తుతం దసరా పండగ పర్వదినాల కారణంగా దర్యాప్తు కాస్త మందగించటంతో ముఖ్యమంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులపై ఒత్తిడి తగ్గింది. కేవలం ముడా అక్రమాలపై ఫిర్యాదు చేసిన స్నేహమయి కృష్ణ మాత్రమే ఈ కేసులో దర్యాప్తునకు హాజరయ్యారు. మరో వైపు మంత్రి భైరతి సురేశ్‌కు ఈడీ నుంచి నోటీసులు వచ్చినా ఆయన విచారణకు సమయం కోరినట్లు సమాచారం. ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రిపై నోటీసుల ఒత్తిడి ప్రస్తుతానికి లేనట్లే. ఏ క్షణంలోనైనా దర్యాప్తు సంస్థల నుంచి పిలుపు రావచ్చని ముఖ్యమంత్రికి కూడా తెలియని విషయం కాదు.



సిద్ధరామయ్య

ఆసక్తికర చర్చలు

ముడా కేసు కారణంగా రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఊహాగానాలు జోరందుకున్నాయి. పైకి విపక్షాల నుంచి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా డిమాండ్ వినిపించినా లోలోపల కాంగ్రెస్‌లోనూ ఈ చర్చ సమాంతరంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ మంత్రులు అదే పనిగా రహస్యంగా సమావేశమవుతున్నారు. ఆపై దిల్లీకి వెళ్లి వస్తుండటంతో ముఖ్యమంత్రి మార్పుపై చర్చ మొదలైంది. సీనియర్లు డాక్టర్ జి.పరమేశ్వర్, సతీశ్ జార్కిహొళి, హెచ్.సి.మహదేవప్ప.. రోజు విడిచి రోజు ఎక్కడో ఓ చోట సమావేశమవటంతో వేడి తీవ్రమైంది. మైసూరు, బెంగళూరుల్లో మంత్రి హెచ్.సి.మహదేవప్ప నివాసాల్లో సతీశ్ జార్కిహొళి, డాక్టర్ పరమేశ్వర్ వరుస మంతనాలు, ఆ తర్వాత తుమకూరులో పరమేశ్వర్- సతీశ్ చర్చలు, సోమవారం బెంగళూరులోని కావేరి భవన్‌లో డీకే- సతీశ్- పరమేశ్వర్ సమావేశాలు.. . ఇలా పదేపదే సీనియర్లు చర్చించడం ప్రస్తావనార్హం. నాయకత్వ మార్పుపై కీలకమైన నిర్ణయాలు ఏ క్షణంలోనైనా వెల్లడిస్తారన్న అంచనా మొదలైంది. ఈ మధ్యలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో రాష్ట్ర సీనియర్ నేతలు సమావేశాలు కొనసాగించడంతో ఈ వాదనలకు మరింత బలం ఏర్పడింది.

ఆ వ్యాఖ్యల మర్మమేంటీ?

మంగళవారం సింధనూరులో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన ఓ వ్యాఖ్య సిద్ధరామయ్యకు ఊరట కలిగించినట్లే. 'పార్టీలో ముఖ్యమంత్రి మార్పుపై ఎలాంటి చర్చ రాలేదు. అంత అవసరం లేదు. ఈ పాలన కాలానికి సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారు' అని వ్యాఖ్యానించారు. దాదాపు ఇదే అభిప్రాయాన్ని ఆయన సోదరులు డీకే సురేశ్ కూడా గతవారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మార్పు వాదన తెరపైకి మరింత బలంగా వచ్చేందుకు కారణమైన సతీశ్ జార్కిహొళి సైతం మంగళవారం స్పందిస్తూ.. నాయకత్వాన్ని మార్చే అవసరం లేదని స్పష్టం చేశారు. తన నాయకత్వానికి మొదటి నుంచీ పోటీగా ఉన్న డీకే సోదరులే స్పష్టం చేసిన తర్వాత సిద్ధు ముందున్న రాజకీయ సమస్య తొలగిపోయినట్లే. మార్పు అవసరమైతే.. అహింద సముదాయం నుంచే నేతను ఎంపిక చేయాలన్న డిమాండ్‌కు ముగ్గురు ప్రముఖుల చర్యలు బలాన్నిచ్చాయి. పార్టీలో పైన పేర్కొన్న నాయకులు మినహా మిగిలిన వారెవరూ సీఎం పదవికి పోటీలో లేరు. సముదాయాల పరంగా మాకూ డీసీఎం పదవి కావాలని మంత్రులు జమీర్ అహ్మద్, కె.ఎన్.రాజణ్ణ మాత్రమే కోరుతున్నారు. వీరితో సతీశ్ జార్కిహొళి కూడా ఉన్నా ఆయన నేడు ఏకంగా ముఖ్యమంత్రి స్థానంపై కన్నేశారు.

చిక్కుముడి వీడిందిలా..

సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వర్గాలే నేడు రాష్ట్ర కాంగ్రెస్‌లో పోటీ పడుతున్నాయి. సిద్ధు పదవిని త్యాగం చేస్తే ఆయన స్థానానికి డీకే ప్రధాన పోటీదారుగా ముందుకు వస్తారు. ఆయన నాయకత్వాన్ని పార్టీలోని సీనియర్లు అత్యధికులు ఆక్షేపిస్తున్నారు. వీరిలో సతీశ్ జార్కిహొళి, పరమేశ్వర్, రాజణ్ణ, మహదేవప్ప తదితరులున్నారు. మిగిలిన సీనియర్ మంత్రులు రామలింగారెడ్డి, కేజే జార్జి, ఆర్.వి.దేశ్‌పాండే, హెచ్.కె.పాటిల్ తదితరులు అధిష్ఠానం వద్ద డీకే నాయకత్వం వల్ల వచ్చే సమస్యలను వివరించే ప్రయత్నం చేయాలని యోచించారు. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా ఐటీ, ఈడీ, సీబీఐ సంస్థలు ఆయన నాయకత్వం మొదలైన వెంటనే నోటీసులతో సిద్ధంగా ఉంటాయి. ఇది పార్టీ మనుగడకే ముప్పు తెస్తుందని అధిష్ఠానంతో చెప్పారని సమాచారం. ప్రత్యామ్నాయంగా అనివార్యంగా దళిత నేతకు అవకాశం, కనీసం ముగ్గురు డీసీఎంలను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ సమయంలో పార్టీలో అలజడి రేగి అది విపక్షాలకు బలంగా మారే ప్రమాదం ఉందని వీరంతా హెచ్చరించారు. ఈ పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి ముఖ్యమంత్రిని మార్చాలన్న ఆలోచన విరమించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.



తుమకూరులో ఇటీవల పరమేశ్వర్, సతీశ్ జార్కిహొళి మంతనాలు

విజయేంద్ర రాజీనామాకు పట్టు

బెంగళూరు (యశ్వంతపుర): ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న భాజపా రాష్ట్రాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తన పదవి నుంచి తప్పుకోవాలని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే డిమాండ్ చేశారు. విజయేంద్రకు వ్యతిరేకంగా లోకాయుక్తలో అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసులతో పాటు అక్రమ నగదు బదిలీ ఫిర్యాదులూ ఉన్నాయని గుర్తు చేశారు. ఈయన బుధవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విధానసభ ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ సీఏ భూమి అక్రమాలు, ఎగువ సభలో ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి భూఆక్రమణల కేసులు ఎదుర్కొంటున్నారని తప్పుపట్టారు.



సిద్ధరామయ్య, థావర్‌చంద్ గహ్లోత్ నమస్కార ప్రతి నమస్కారాలు

రాజ్‌భవన్‌లో నవ్వుల పువ్వులు!

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : నిన్నమొన్నటి దాకా ఉప్పు- నిప్పులా కానవచ్చిన గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం ఒక్కటిగా సందడి చేశారు. గత కొద్ది రోజులుగా ఆ ఇద్దరూ ప్రచ్ఛన్న యుద్ధానికి దిగడం తెలిసిందే. మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మిజ్జు నగరానికి విచ్చేసిన నేపథ్యంలో ఆయనకు స్వాగత సత్కారాల కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎమ్మెల్సీ గోవిందరాజు రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. అక్కడ సిద్ధును చూడగానే గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ సంతోషంగా నవ్వారు. ఇద్దరూ నమస్కార-ప్రతినమస్కారాలతో సందడి చేశారు. తొలుత సిద్ధు ముభావంగా కనిపించినా.. చివరికి మాటలు కలిపి.. ప్రసన్న వదనంతో కరచాలనం చేసి.. కలియతిరిగారు.

● మాల్దీవుల రాష్ట్రపతి డాక్టర్ మహ్మద్ మిజ్జు, ప్రథమ మహిళ సాజిదా మహ్మద్ తమ అధికార పర్యటనలో భాగంగా దిల్లీ నుంచి బెంగళూరుకు బుధవారం చేరుకున్నారు. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న వారిని మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, అధికారులు ఉమా మహదేవన్, డాక్టర్ ఎన్.శివశంకర్, నగర పోలీసు కమిషనర్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రాజ్‌భవన్‌కు చేరుకున్న మాల్దీవుల రాష్ట్రపతి, ఆయన భార్య అధికారులకు అక్కడి సిబ్బంది స్వాగతం పలికారు. సాజిదా మహ్మద్ బెంగళూరులోనే విద్యాభ్యాసం చేశారని గహ్లోత్ తెలిపారు. బెంగళూరులోని ఐటీ పరిశ్రమలు తమ దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించేందుకు నగరానికి వచ్చారు. అంకుర పరిశ్రమలు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన సంస్థల ఏర్పాటుకు తమ దేశం అనువుగా ఉందని అధ్యక్షుడు వివరించారు. 'కర్ణాటక ఒక రాష్ట్రం-పలు ప్రపంచాలు' (ఒన్ స్టేట్ - డిఫరెంట్ వరల్డ్స్) పేరిట పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామని అధికారులు ఆయనకు వివరించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు, అధికారులతో కలిసి మాల్దీవుల నుంచి వచ్చిన ప్రతినిధులు బృంద చిత్రాన్ని దిగారు.



మాల్దీవుల అధ్యక్షుడితో గవర్నర్ గహ్లోత్, సీఎం సిద్ధు, అధికారుల బృంద చిత్రం

జంబూసవారీకి నగారా!

జోరుగా గజరాజుల సాధన

మైసూరు, న్యూస్‌టుడే : విఖ్యాత దసరా ఉత్సవాలు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయి. అక్టోబరు 12న సాయంత్రం శుభ కుంభలగ్నంలో జంబూ సవారీ ప్రారంభించడానికి సకలం సిద్ధం చేస్తున్నారు. ఏనుగులకు పుష్పార్చన చేసేందుకు ప్యాలెస్ ముందు వేదికను నిర్మించారు. నిత్యం 750 కిలోల బరువుతో తాలీములో పాల్గొంటున్న అభిమన్యు, కుమ్కీ అనే ఏనుగులు హిరణ్య, లక్ష్మి, ధనుంజయ, గోపిలతో పాటు అశ్విక దళం, పోలీసు బ్యాండు, పోలీసు కవాతుదళం బుధవారం మరో విడత అభ్యాస ప్రక్రియను నిర్వహించాయి. ఏనుగులు ఎటువంటి బెదురు లేకుండా ప్యాలెస్ నుంచి నగర వీధుల్లో సంచరించాయని అటవీశాఖ అధికారి డాక్టర్ ప్రభుగౌడ తెలిపారు. గురువారం చివరి విడత అభ్యాస ప్రక్రియ ఉంటుందన్నారు. ఫిరంగి గుండ్లు పేల్చుతూ అభ్యాసాన్ని చేయిస్తున్నామని తెలిపారు. అంబావిలాస్ ప్యాలెస్ ఆవరణలో గురువారం నిర్వహించిన పోలీసు బ్యాండ్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

డ్రోన్ల ప్రదర్శన

గగన తలంలో గురు, శుక్రవారాల్లో డ్రోన్ల ప్రదర్శనను నిర్వహిస్తామని చెస్కాం ప్రకటించింది. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రోన్ షోను వీడియోలు తీసుకున్న కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని అధికారులు గుర్తించారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బన్నిమండపం వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహించే మైదానంలో డ్రోన్ షో ఉంటుంది. ఇప్పటికే వీడియోలను ప్రదర్శిస్తున్న పలువురికి నోటీసులు జారీ చేశామన్నారు. నేడు, రేపటి డ్రోన్ షోలను ప్రతి ఒక్కరూ ఉచితంగా వీక్షించవచ్చని అధికారులు ప్రకటించారు.



జంబూసవారీ నమూనా ప్రదర్శన వీక్షిస్తున్న అధికారుల బృందం

గిరిధామం కిటకిట



చాముండి కొండపై భక్తుల దండు

దేశ విదేశాల నుంచి వస్తున్న భక్తులు, పర్యాటకులు చాముండిబెట్టపైకి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పండగ సెలవులకు వస్తున్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించుకుని, ముడుపులు చెల్లించి వెళుతున్నారు. అమ్మవారికి ఒక్కో రోజు ఒక్కో అలంకరణ చేస్తున్నారు. నిత్యం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ఆవరణలో అర్చకులు చాముండేశ్వరి దర్బార్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. నాడదేవతకు భాజపా నాయకుడు బసనగౌడ పాటిల్ యత్నాళ్ బుధవారం పూజ చేసుకుని వెళ్లారు. బెట్టపై ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించారు. అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులు గట్టి భద్రతను కల్పించారు.

స్తబ్ధచిత్రాలు సిద్ధం



కిత్తూరు రాణి చెన్నమ్మ స్తబ్ద చిత్రం సిద్ధం

జంబూ సవారీకి స్తబ్ద చిత్రాలు సిద్ధమవుతున్నాయి. ఈసారి 31 జిల్లాల నుంచి 31 శాఖలు సంయుక్తంగా 19 స్తబ్ద చిత్రాలను జంబూ సవారీలో ప్రదర్శించనున్నారు. రాజ్యాంగ ప్రతి, సాలుమరద తిమ్మక్క, కిత్తూరు రాణి చెన్నమ్మ, కోలారు కోటిలింగేశ్వర దేవాలయం, కొప్పళ హులిగమ్మ దేవి ఆలయం, బీదర్‌లోని చెన్నపట్టణ బసవదేవరు, చామరాజనగర సోలిగర సొగడు, కొడుగు హారంగి జలాశయం, అనుభవ మండపం, బుద్ధుడు, బసవేశ్వరుడు, అంబేడ్కర్ ప్రతిమలు, మురుడేశ్వర దేవాలయం తదితర స్తబ్ద చిత్రాలను జంబూసవారీ జాతాలో ప్రదర్శిస్తామని స్తబ్ద చిత్రాల ఉప సమితి అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు.

యువ దసరా జోష్

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు ఉత్తనహళ్లిలో నిర్వహిస్తున్న యువ దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ గాయకుడు బాద్‌షా మంగళవారం రాత్రి ఇచ్చిన ప్రదర్శన ఆహూతులు, ప్రేక్షకులు, యువతను ఆకట్టుకుంది. 'హే లడకీ బ్యూటిఫుల్ గర్కేచుల్', 'మే పానీ పానీ హోగయా', 'ఇకు హోగయ్ హమా హమా' తదితర గీతాలకు ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన లభించింది. దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ పాడిన 'నీనే రాజకుమార్' పాటకు ప్రేక్షకుల నుంచి వన్స్‌మోర్ అంటూ కేకలు వినవచ్చాయి. 'నేను గాయకుడ్ని కాదు. పాటల రచయితను. నా భావనలను రాసుకుని పాడుతున్నాను. వాటిని మీరంతా ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు' అని బాద్‌షా పేర్కొన్నారు. మైసూరుకు చెందిన నేపథ్య గాయకుడు రవీంద్రనాథ్, ఇతర కళాకారులు కన్నడ పాటలతో ప్రేక్షకులను రంజింపజేశారు. రాజ్‌కుమార్, పునీత్, శివరాజ్ కుమార్, అంబరీశ్, విష్ణువర్ధన్, రవిచంద్రన్, ఉపేంద్ర తదితరులు నటించిన చిత్రాల్లోని పాటలకు మైదానంలోని ప్రేక్షకులు కూడా గొంతు కలిపారు. కర్ణాటక ప్రభుత్వం జారీ చేస్తున్న గ్యారంటీ పథకాలను వివరించే ఒక గీతాన్ని వాత్సల్య విద్యా సంస్థ విద్యార్థులు ఆలపించారు. కళాభారతి పీయూ కళాశాల విద్యార్థులు చాముండేశ్వరి నవదుర్గల అవతారాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. మహారాణి కళాశాల విద్యార్థినులు మహిళా సాధికారత, సమానత్వంపై జాగృతి కల్పించే నాట్య ప్రదర్శనకూ చక్కని స్పందన లభించింది.



యువ దసరా వేడుకల్లో యువత



పాటలతో ఉర్రూతలూగిస్తున్న గాయకుడు బాద్‌షా

మహిళా సాధికారతకు పెద్దపీట

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం కెఫెలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్య విద్యా శాఖ మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్ తెలిపారు. దేవనహళ్లిలో జాతీయ జీవనోపాధి మిషన్-కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అక్క కెఫె'ను పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్పతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. స్వసహాయ బృందాలకు చెందిన మహిళలు ఈ కెఫేలను నిర్వహించేందుకు అనువుగా గత బడ్జెట్‌లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక వంటకాలకు పెద్ద పీట వేస్తూ.. తక్కువ లాభంతో ఎక్కువ మందికి ఆహారాన్ని అందించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 50 కెఫేలను మొదటి విడతలో ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా 2500కు పైగా యూనిట్లు ప్రారంభించేందుకు స్వసహాయ బృందాలకు బాధ్యత అప్పగిస్తామని తెలిపారు. నిర్వాహకులకు పాకశాస్త్రం, ఆతిథ్య రంగానికి చెందిన నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. స్టార్టప్ విలేజ్ ఎంట్రప్యూనర్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కెఫేలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. అధికారులు ఉమా మహదేవన్, శ్రీవిద్యా, అనూరాధ, బెంగళూరు గ్రామీణ జిల్లాధికారి శివశంకర్ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.



కాఫీ తాగుతూ.. మెనూ పరిశీలిస్తున్న శరణుప్రకాశ్ పాటిల్



రిబ్బను కత్తిరిస్తున్న మంత్రులు మునియప్ప, పాటిల్

కట్టుకున్నోడినే కడతేర్చింది

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : కుమారుడితో పాటు మరో ఇద్దరితో కలిసి ఆమె ఏకంగా భర్తను కడతేర్చిన సంఘటన బెంగళూరు మాదనాయకనహళ్లి పోలీసు ఠాణా పరిధిలో విషాదం నింపింది. వారి దాడిలో మునిరాజు (38) హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఆయన భార్య గీత (35), కుమారుడు హేమంత్, మరో ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆమె వేరొకరితో సన్నిహితంగా ఉండటంతో ఆయన తరచుగా గొడవకు దిగేవాడని గుర్తించారు. ఆ బాధతోనే మునిరాజు తాగుడుకు అలవాటు పడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన ఆయనపై నలుగురూ ఒకేసారి దాడిచేసి కడతేర్చాక, మృతదేహాన్ని హాళేగుడ్డదహళ్లి ప్రభుత్వ పాఠశాల వెనక ఓ పాత భవనంలో పడేశారని పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం ఆ భవనం వద్ద చెత్త సేకరించే యువకులు విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎన్‌ఆర్‌ఆర్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అడ్డదారుల్లో పాక్ నుంచి వలస

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నివశిస్తున్న 14 మంది పాకిస్థాన్ ప్రజలను బెంగళూరు నగర పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నగరంలో ఇటీవల కాలంలో అరెస్టైన పాక్ ప్రజల సంఖ్య 22కు పెరిగిందని అధికారులు తెలిపారు. ఆనేకల్ తాలూకా జిగణి పారిశ్రామికవాడలో ఇద్దరు పాక్ వాసులను ఇటీవల అదుపులోకి తీసుకుని విచారించాక.. ఇతరుల గుట్టు వెలుగు చూస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మారుపేర్లతో ఆధార్, ఓటర్ల కార్డుల సాయంతో వారంతా ఆశ్రయం పొందారని గుర్తించారు. పాక్ నుంచి వీరందరినీ రప్పించి- ఆవాసం చూపేందుకు సహకరించిన పర్వేజ్ అరెస్టుతో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆ దేశం నుంచి వచ్చిన వారికి హిందువుల పేర్లు పెట్టి, బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటరు కార్డులను సృష్టించి ఇచ్చారని విచారణలో వెల్లడైంది. జిగణిలో వారి ఆవాసాలపై దాడులు చేసేందుకు నాలుగు పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు. చెన్నై, దిల్లీ, హైదరాబాద్ నగరానికి వెళ్లి దర్యాప్తు చేపట్టి 'మెహది ఫౌండేషన్'తో సంబంధాలున్న 22 మందిని మొత్తంగా అరెస్టు చేశారు. వారంతా మత ప్రచారానికే వచ్చారని సమాచారం. ఇదే కోవలో పీణ్యాలో ఉంటున్న ఓ జంటనూ విచారిస్తున్నారు. మూడేళ్ల నుంచి పీణ్యా సమీపంలోని అంధ్రహళ్లి ప్రధాన రహదారిలో వారు జీవనం సాగించారని తేలింది. ఆ ఇద్దరూ రాత్రిళ్లు మాత్రమే సంచరించేవారని అధికారులు తెలిపారు. 2019 నుంచి భారత్‌లోనే ఉంటున్న వారు యూట్యూబ్ వేదికగా మతప్రచారం చేస్తున్నట్లు గుర్తించారు. నగరంలో అక్రమంగా నివసిస్తున్న పాక్ ప్రజలను అరెస్టు చేసినట్లు హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ధ్రువీకరించారు.

నగదు కోసమే వ్యాపారిపై తేనెవల

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : నగదు కోసం ఒక వ్యాపారి నగ్న వీడియోలను అడ్డుపెట్టుకుని బెదిరిస్తున్న మహిళ, ఆమె నలుగురు అనుచరులను హుబ్బళ్లి సీసీబీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పాత్రలను విక్రయించే వ్యాపారి చగన్‌లాల్ ఫిర్యాదుతో జోయా నదాఫ, పర్వీన్ బళ్లారి, సయ్యద్ తహసీల్దార్, తౌసిఫ్, అబ్దుల్ అనే వారిని నిందితులుగా గుర్తించారు. నిందితుల నుంచి రెండు బైకులు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.9 వేల నగదు జప్తు చేసుకున్నారు. కేసు తదుపరి దర్యాప్తు అశోకనగర ఠాణా పోలీసులకు అప్పగించారు.

నౌకాశ్రయంపై డ్రోన్ దుష్ట కన్ను

కార్వార, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం కార్వారలోని నావికాదళానికి కీలకమైన కదంబ బేస్‌పై మంగళవారం అర్ధరాత్రి ఒక డ్రోన్ సంచరించడాన్ని అధికారులు గుర్తించారు. ఇటీవల ఇక్కడ ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న ముగ్గురు కార్మికులు హనీట్రాప్ వలలో చిక్కుకున్నారు. ఇక్కడి నుంచి సేకరించిన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చెందిన కొందరు ఏజెంట్లకు పంపించిన ఆరోపణలపై వారిని అరెస్టు చేశారు. మరికొందరు నిందితులు నావల్ బేస్‌కు చెందిన వివరాలను తెలుసుకునేందుకు డ్రోన్ వినియోగించారని అనుమానిస్తున్నారు. వక్కనళ్లి నుంచి ఐఎన్ఎస్ పతంజలి ఆసుపత్రి, బిణగా జాతీయ రహదారి వరకు డ్రోన్ సంచరించిందని గుర్తించారు. బైకు లేదా సన్‌రూఫ్ ఉన్న కారులో వెళుతూ నిందితులు డ్రోన్ వినియోగించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

ప్రభుత్వ జీతం..ప్రైవేటుగా వైద్యం

☛ బీఎంసీఆర్‌సీ నిర్దేశకుడికి తాఖీదు జారీ చేయండి ☛ వాడీవేడిగా జడ్పీ ప్రగతి పరిశీలన సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా పంచాయతీ ప్రగతి పరిశీలన సమావేశం బుధవారం వాడీవేడిగా జరిగింది. జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సమస్యలపై సభ్యులు గళమెత్తారు. బీఎంసీఆర్‌సీ ఆసుపత్రిలో పేదలు, సామాన్యలకు మెరుగైన చికిత్స అందించడం లేదు. ఔషధాలను బయటకు రాసిస్తున్నారు. చికిత్స, శస్త్రచికిత్సలు, వివిధ పరీక్షలకూ ప్రైవేట్ ఆసుపత్రులకు రాస్తున్నారు. బీఎంసీఆర్‌సీలో పనిచేసే వైద్యులకు క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయి. పలువురు పేదలు, సామాన్యులు తమ వద్దకు వచ్చిన డబ్బులు తీసుకుని వెళ్తున్నారు. బీఎంసీఆర్‌సీ నిర్దేశకుల చరవాణికి ఫోన్ చేసినా స్పందించడం లేదని ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. సమావేశానికి నిర్దేశకుడు డా. గంగాధరగౌడ రాకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిర్దేశకుడికి తాఖీదులు జారీ చేసి సస్పెండ్ చేయాలని డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు సూచించారు. క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందడం లేదు. బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రికి వెళ్లడానికి వారం రోజులు ముందు బుక్ చేసుకున్నా పడకలు లభించడం లేదు. బళ్లారిలోనే క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందజేసే విధంగా చూడాలని కంప్లి ఎమ్మెల్యే జె.ఎన్. గణేశ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్‌ను కోరారు. దీనిపై జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ బళ్లారి నగరంలో 200 పడకలతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించడానికి కె.ఎం.ఇ.ఆర్.సి. నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు సమాధానం ఇచ్చారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో డెంగీ నియంత్రణలో ఉంది. వారం రోజుల ముందు సిద్ధమ్మనహళ్లికి చెందిన ఓ బాలుడు డెంగీతో మృతిచెందాడు. చికిత్సకు ఆలస్యంగా రావడంతో పరిస్థితి చేయిదాటి పోయిందని మంత్రికి వివరించారు. సరైన అంబులెన్స్‌లు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్ మంత్రికి వివరించారు.

● బళ్లారి కె.ఎం.ఎఫ్.కు పాడి రైతులు నుంచి సేకరిస్తున్న పాల ధర లీటరుపై రూ.1.50 తగ్గించడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తగ్గించిన పాల ధరను పెంచాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మంత్రిని కోరారు. కె.ఎం.ఎఫ్. అధికారి సమాధానం ఇస్తూ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ అక్టోబరు 1 నుంచి పాల ధరను పెంచుతున్నట్లు ప్రకటించారని, సమావేశంలో తీర్మానం చేస్తామన్నారు. వ్యవసాయ పరికరాల పంపిణీలో ఎమ్మెల్యే అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, గ్యారంటీ పథకాల యోజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు రేవణ్ణ, ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్, జిల్లా బాధ్య కార్యదర్శి త్రిలోకచంద్ర, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, జిల్లా పోలీస్ అధికారి శోభారాణి పాల్గొన్నారు.


దివ్యాంగులకు యంత్రాలు వితరణ చేస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్


సమావేశానికి హాజరైన అధికారులు


మాట్లాడుతున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎంపీ ఇ.తుకారామ్, ఎమ్మెల్యేలు జె.ఎన్.గణేశ్, నారా భరత్‌రెడ్డి, జిల్లా బాధ్య కార్యదర్శి త్రిలోకచంద్ర, డీసీ, జడ్పీ సీఈవో, ఎస్పీ తదితరులు

మూడు రోజుల్లో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్‌కేయూ) 6వ సెమిస్టర్ ఫలితాలను మూడు రోజుల్లో ప్రకటించినట్లు ఉపకులపతి మునిరాజు పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపకులపతి మునిరాజు, మూల్యాంకన రిజిస్ట్రార్ రమేశ్ ఓ ఓలేకార్ ఫలితాలను విడుదల చేసి మాట్లాడారు. బీఏ మూల్యాంకనాన్ని యుయుసీఎంఎస్ సాంకేతిక పద్ధతిని ఉపయోగించి మూడు రోజుల్లో ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాలకు చెందిన బీఏ 6వ సెమిస్టర్‌లో 1000 మంది విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం చేయడానికి అనుకూలంగా మారిందన్నారు. మూల్యాంకనం ముగిసిన వెంటనే ఆలస్యం చేయకుండా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. గతంలో వీఎస్‌కేయూలో పరీక్షలు ముగిసిన రెండు, మూడు నెలలు గడిచినా ఫలితాలు విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడే వారన్నారు. సాంకేతిక పద్ధతులను ఉపయోగించి వారం, పది రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తామన్నారు. రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వీఎస్‌కేయూ ఉపకులపతి మునిరాజు, చిత్రంలో రిజిస్ట్రారు ఎస్.ఎన్.రుద్రేశ్, రమేశ్ ఓ ఓలేకార్ తదితరులు

దసరా వేళ దేవదేవుళ్ల వేడుక!


శరన్నవరాత్రులను పురస్కరించుకుని కోలారు జిల్లాలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహణ కొనసాగింది. కోలారు నగర దేవత కోలారమ్మకు విశేష పూజలు కొనసాగాయి. ముళబాగిలు సూర్యనారాయణ స్వామి ఆలయంలో మూలవిరాట్ విగ్రహాన్ని నాణేలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముళబాగిలు తాలూకా ఖాద్రీపురలోని శనిమహాత్మ స్వామిని బంధిపులు, నిమ్మకాయల దండలతో, రత్నాలు పొదిగిన కిరీటంతో అలంకరించారు. శ్రీనివాసపురలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు వరాహి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నంగలిలో నిర్వహించిన సరస్వతి పూజలో నవదుర్గల విగ్రహాలను తీర్చిదిద్దారు. కొందరు భక్తులు ఇళ్లలో తయారు చేసుకు వచ్చిన ప్రసాదాన్ని ఆలయాలకు వచ్చిన వారికి వితరణ చేశారు. **-న్యూస్‌టుడే, కోలారు**


వరాహి కన్యకాపరమేశ్వరి అమ్మవారి కొలువు

సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది డిమాండ్లపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడతో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ హామీ ఇచ్చారు. జనభాకు అనుగుణంగా అధికారులు, సిబ్బందిని పెంచాలి. పనికి తగిన వేతనం అందజేయాలి. వివిధ పథకాల అమలును తగ్గించి, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా చూడాలన్నారు. మంత్రి హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

–న్యూస్‌టుడే, బళ్లారి



కలిసిపోతే.. ఎంత బాగుంటుందో!

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు ప్రధాన నాయకులు ముగ్గురునీ దసరా కలిపింది. ఇది ఎల్లవేళాలా ఇలానే ఉంటే ఎంత బాగుంటుందీ అనేదే..ప్రస్తుతం సింధనూరు తాలూకా అంతటా అందరి నోటా వినిపించే మాట. ఈ ముగ్గురివీ మూడు పార్టీలు. సిట్టింగ్ ఎమ్మెల్యే బాదర్లి (కాంగ్రెస్) మాజీ మంత్రి నాడగౌడ (జేడీఎస్), మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప (భాజపా) ముగ్గురివీ భిన్న ధృవాలు. రాజకీయంగా ఒకరంటే ఇంకొకరికి పడదు. ముగ్గురదీ ఎడ్డెం అంటే తెడ్డెం పద్ధతి. మామూలు రోజుల్లో వీరు పరస్పరం విమర్శించుకోవడం..తీవ్ర స్థాయిలో దూషించుకోవడం చూసే జనానికి నెల రోజులుగా ఈ ముగ్గురూ ఎక్కడ కనపడినా నవ్వుల్లో మునగడం..ఒకరినొకరు తీవ్రంగా చర్చించుకోవడాలు, ఒకరికొకరు సలహాలు తీసుకోవడం జనంలో చర్చగా మారింది. దసరా ఉత్సవాలు వీరిని ఒక్కటి చేశాయి. ఉత్సవ సమితికి వీరు అధ్యక్షులు, కార్యాధ్యక్షులు, గౌరవాధ్యక్షులు. పండగ సందర్భంగా నెల రోజులుగా ఒకటే మాట..ఒకటే బాటగా ఉన్న వీరు ముగ్గురూ రాత్రి ఆర్జీఎం మైదానం ఉత్సవ వేదికపై కలసి నాట్యం కూడా చేశారు. ఈ దృశ్యాన్ని అనేక చరవాణులు క్లిక్ అనిపించాయి. పండగ కోసం కలిసిన వీరు..పూర్తిగా కలిసిపోతే..ఎంత బాగుంటుందీ అనేది జనవాక్కు.


నెల రోజులుగా దసరా ఉత్సవ ఏర్పాట్లలో అన్నిచోట్లా ఈ ముగ్గురే


రాజస్థానీ గూమ్రా బృందంతో కలసి నృత్యం చేస్తున్న బాదర్లి, కేవీ, నాడగౌడ

గాంధీజీ సిద్ధాంతాలను అలవర్చుకోవాలి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ జాతిపిత గాంధీజీ తత్వ సిద్ధాంతాలను తమ జీవనంలో అలవర్చుకుంటే ప్రశాంతంగా గడుపుతారని అఖిల కర్ణాటక జన జాగృతి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ పేర్కొన్నారు. బుధవారం తాలూకాలోని భరమసాగర గ్రామంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన గాంధీ స్మృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గాంధీజీ సత్యం, అహింసలను తన ప్రధాన ఆయుధాలుగా మలచుకొని బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టి దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టారన్నారు. జిల్లా ప్రాజెక్టు అధికారి దినేశ్ పూజారి, తాలూకా ప్రాజెక్టు అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.


భరమసాగరలో గాంధీ స్మృతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంజునాథ్

యువత ఆరోగ్య రక్షణే లక్ష్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటి వినియోగం మానసిక, శరీరక ఆరోగ్యానికి నష్టదాయకమంటూ బెంగళూరు జ్ఞాన భారతి ప్రాంగణంలో జాతీయ న్యాయ కళాశాల విద్యార్థులు బుధవారం ప్రత్యేకంగా వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీసులు నేతృత్వం వహించారు. యువత మత్తులో ఉంటే సమాజం అభివృద్ధి చెందబోదని కళాకారులు హెచ్చరించారు. మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని హితవు పలికారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను నిషేధించామని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

నిగర్వులు.. సింధనూరు ప్రజలు

సింధనూరు, న్యూస్‌టుడే: రాయచూరు జిల్లా..అందునా సింధనూరు ఎందులోనూ తక్కువగా లేదు, రాష్ట్ర, జాతీయ కీర్తి కలిగిన మహత్తర తాలూకా కేంద్రం సింధనూరు అని స్థానిక ప్రొఫెసర్ డా.మధుమతి దేశ్‌పాండే కొనియాడారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్థానిక ఆర్జీఎం మైదానంలో..క్రీడా దసరా, ఆరోగ్య దసరా కార్యక్రమాలు ఒకే వేదికపై జరిగాయి. తొలుత కార్యక్రమాల్ని ప్రారంభించిన ప్రముఖ పిల్లల వైద్యుడు కె.శివరాజ్, కారటగి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా.శకుంతల పాటిల్ మాట్లాడి ప్రజలకు ఆరోగ్య సూత్రాలు, పాటించాల్సిన ఆహారపు పద్ధతులు వివరించి చెప్పారు. అనంతరం డా.మధుమతి దేశ్‌పాండే సింధనూరు చరిత్రను వివరించారు. పక్కనే బంగారు గనుల హట్టి ఉంది. అంటే బంగారు గనుల మీద కుర్చున్నా సింధనూరు ప్రజలకు గర్వం లేదన్నారు. దేశానికి చక్కని బంగారం వంటి బియ్యాన్ని అందిస్తున్నా మనలో గర్వం లేదని సింధనూరును పొగడ్తలతో ముంచెత్తారు. అనంతరం క్రీడా దసరాలో భాగంగా తెలుగువారు, రంగాపూరు క్యాంపు వాసి పారిస్ పారా ఒలింపిక్స్ కోచ్‌గా వెళ్లిన వాకలపూడి నాగేశ్వరరావును, మరో సింధనూరు యువకుడు ఐపీఎల్ క్రికెట్ రాయల్ ఛాలెంజర్స్ (ఆర్‌సీబీ) జట్టు క్రీడాకారుడు మనోజ్ బాండిగెను, తెలుగు యువకుడు వాలీబాల్ క్రీడలో రాష్ట్రస్థాయికి వెళ్లిన శివ తదితరులను వేదికపై ఘనంగా సత్కరించారు.


ఆరోగ్య, క్రీడా దసరా కార్యక్రమాలు ప్రారంభిస్తున్న వైద్యులు శివరాజ్, శకుంతల తదితరులు


వేదికపై సన్మానం స్వీకరిస్తున్న ఒలింపిక్స్ కోచ్ వాకలపూడి నాగేశ్వరరావు, ఆర్‌సీబీ జట్టు సభ్యుడు క్రికెటర్ మనోజ్ బాండిగె

ఇన్‌స్టాగ్రాం ప్రేమ పిచ్చి చివరికి.. గర్భందాల్చి..

బెంగళూరు (యశ్వంతపుర) : సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన ఓ వ్యక్తి.. ప్రేమిస్తున్నట్లు నమ్మించి రెండుసార్లు వరుసగా లైంగికదాడికి పాల్పడినట్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ యువతి (30) బెంగళూరు గోవిందపుర ఠాణా మెట్లెక్కారు. కేరళకు చెందిన బిలాల్‌రఫీక్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆమె నగరంలో సాఫ్ట్‌నర్సుగా పని చేస్తున్నారు. 2021లో ఇన్‌స్టాగ్రామ్‌లో బిలాల్ రఫీక్‌తో పరియం ఏర్పడింది. ఇద్దరూ ఫోన్ నెంబర్లను మార్చుకుని.. మాటలు కలిపారు. ఆపై ప్రేమంటూ ఆ వ్యక్తి నమ్మబలికినట్లు బాధితురాలు వాపోయారు. ఈ చనువుతోనే రెండుసార్లు లైంగిక దాడికి తెగించడంతో గర్భం దాల్చినట్లు చెప్పగా.. దాన్ని ఆ వ్యక్తి కారణంగానే విచ్ఛిన్నం చేసుకున్నట్లు వివరించారు. పెళ్లి చేసుకునేందుకు అంగీకరించి, నా వద్ద నగదు, బంగారు నగలు తీసుకున్నాక నిరాకరించాడని ఆరోపించారు. అసభ్యంగా తిట్టడంతో పాటు కులం పేరుతో దూషించి అవమానించాడని ఫిర్యాదులో వివరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బిలాల్ రఫీక్‌ను బుధవారం అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

కంప్లి అభివృద్ధికి రూ.వంద కోట్లు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి విధానసభ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వివిధ పథకాల కింద రూ.వంద కోట్లకు పైగా నిధులు కేటాయించామని రాష్ట్ర వసతి, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ వెల్లడించారు. కంప్లిలో వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పేద, బడుగు వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. పంచ గ్యారంటీల అమలుతో పాటు ఇళ్లు లేని వారికి నిర్మించి ఇస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు చూసి గత లోక్‌సభ ఎన్నికల కన్నా ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పది శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. ఓర్వలేని భాజపా నేతలు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే గణేశ్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ క్షేత్రానికి 5వేల ఇళ్లు కేటాయించాలని మంత్రిని కోరారు. బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మాట్లాడారు. అంతకుముందు జానపద కళా బృందాలు వెంట రాగా ఉద్భవ గణపతి ఆలయం నుంచి మంత్రిని వాహనంలో ఊరేగింపుగా సత్యనారాయణ పేటె ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని సభా స్థలి వరకు తీసుకొచ్చారు. మార్గ మధ్యంలో ఆయన అంబేడ్కర్‌కు పూజలు నిర్వహించారు. జిల్లా పాలనాధికారి ప్రశాంతకుమార్ మిశ్రా, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూరు, ఎస్పీ డాక్టర్ శోభారాణి, నాయకులు ముండ్రిగి నాగరాజ్, కె.శ్రీనివాస రావు, చెన్నబసవ గౌడ, అంజినప్ప, కంప్లి, కురుగోడు తాలూకాల ప్రజా ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్.. పక్కన ఎమ్మెల్యేలు గణేశ్, నారా భరత్ రెడ్డి

రైల్వే కింద వంతెనల్లో వరద నీటితో ఇబ్బందులు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర, మొళకాల్మూరు, హొసదుర్గం, హొళల్కెరె, చిత్రదుర్గం తాలూకాల్లో సుమారు 20 గ్రామాల వద్ద నిర్మించిన రైల్వే కింద వంతెనల్లో వర్షాలకు నీరు చేరడంతో అటుగా రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చిత్రదుర్గం లోక్‌సభ సభ్యుడు గోవిందకారజోళ పేర్కొన్నారు. బుధవారం ఆయన రైల్వే అధికారులను వెంటబెట్టుకొని తురవనూరు రహదారిలోని రైల్వే కింది వంతెనను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. జిల్లాలో కింది వంతెనలను అవైజ్ఞానికంగా నిర్మించారని చెప్పారు. వర్షాకాలంలో మోకాలి లోతు వరకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో సంచారానికి తీవ్ర అడ్డంకిగా మారిందన్నారు. ప్రయాణికులు మైళ్ల కొద్ది చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు.


వరద నీటితో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను రైల్వే శాఖ అధికారులకు చూపుతున్న లోక్‌సభ సభ్యుడు గోవిందకారజోళ

గుమ్మందాకా వచ్చే.. అమ్మవారు

హొసపేటె ఏడు కేరీల్లో విశిష్ట విజయదశమి ఉత్సవాలు



ఇంటింటికీ వెళ్తున్న అమ్మవారి పల్లకీ

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటెలోని ఏళు కేరి (ఏడు వాడ)ల్లో దసరా ఉత్సవాలను విభిన్నంగా ఆచరిస్తారు. ఏటా ఇక్కడ దసరా ఉత్సవాలు చూడముచ్చటగా ఉంటాయి. హొసపేటెను పూర్వం నాగలాపుర అని పిలిచేవారు. రానురాను హొసపేటె (కొత్తపేట)గా మారింది. ఈ పట్టణం విజయనగర సామ్రాజ్య పరిధిలో ఉండేది. ఆ సమయంలో హంపీలో నవమి ఉత్సవాల ఘనంగా ఆచరించేవారట. ఆ సంప్రదాయాన్ని ఇక్కడి ఏడు వాడల ప్రజలు కొనసాగిస్తున్నారు. ఏడు వాడల్లో దాదాపు వాల్మీకి కులానికి చెందినవారే ఉన్నారు. విజయనగర సామ్రాజ్యంలో ఆ సమూదాయానికి చెందిన సైనికుల ఏడు బలిష్టమైన బృందాలు ఉండేవట. సామ్రాజ్య పతనానంతరం ఆ ఏడు వర్గాల పెద్దలు ఏడు వాడల్లో వచ్చి స్థిరపడటంతో ఏడు కేరి (వాడ)లు ఏర్పడ్డాయి. ఆ తీపిగుర్తులుగా సైనికులు దేహదారుఢ్య కసరత్తులు చేసేందుకు నిర్మించిన వ్యాయామశాలలు నేటికీ ఉన్నాయని, ఈ ఏడు వాడలపై పరిశోధన చేసిన హంపీ విశ్వవిద్యాలయ ఆచార్య డాక్టర్ తారిహళ్లి హనుమంతప్ప స్పష్టం చేస్తున్నారు.

● **వాడకో అమ్మవారు:** ఏడు వాడల్లో దుర్గాదేవిని ఎక్కడా ప్రతిష్ఠంచరు. ఆ రూపంలో ఉన్నారని భావిస్తున్న మ్యాసకేరి (వాడ)లో హులిగెమ్మ, ఉక్కడకేరిలో కొంగమ్మ, చిత్రకేరిలో జలదుర్గమ్మ, బాణదకేరిలో బళ్లారి దుర్గమ్మ, తళవారకేరిలో నిజలింగమ్మ, జంబనళ్లి కేరిలో రాంపుర దుర్గమ్మ, బండికేరిలో తాయమ్మ, మరియమ్మలను ప్రతిష్ఠించారు.

● **ఎందుకీ ఆచారం:** నాడు ఉన్నత కులాలవారు తమ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి దర్శనానికి ఇక్కడి సమూదాయాన్ని అనుమతించేవారు కారట. ఈ నేపథ్యంలో తమ వాడల్లోనే తమ కిష్టమైన అమ్మవారిని ప్రతిష్ఠించి వారికో పేరు పెట్టి పూజిస్తూ వస్తున్నారని వాడ పెద్దలు పేర్కొంటున్నారు.

● నవరాత్రి సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పల్లకీలో ప్రతిష్ఠించి, ఏడు వాడల్లో తిప్పుతారు. గుమ్మందాకా అమ్మవారు వచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అక్కడే పూజలు చేసి కానుకలు సమర్పిస్తారు. ఆయుధపూజ నాడు అమ్మవారి పల్లకీలు ఒకచోట కలిసి, ఊరేగింపుగా వెళతారు. పట్టణం నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని ధర్మదగుడ్డ ప్రాంతంలో నెలకొన్న చెన్నబసవణ్ణ - నిజలింగమ్మ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ పరస్పర శమీ వినిమయం చేసుకొని అమ్మవార్లను తిరిగి వాడల్లోకి తీసుకొస్తారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున డోలు, కోలాటం, నృత్య కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం ప్రజలు పరస్పర శమీ వినియోగం చేసుకోవడంతో దసరా ఉత్సవాలు ముగిస్తాయి. విజయనగర రాజులు కూడా నవమి ఉత్సవాల్లో భాగంగా ధర్మద గుడ్డ ప్రాంతానికి వచ్చి పూజలు చేసిన అనంతరమే పరస్పర శమీ వినియోగం చేసుకునేవారట. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.


ధర్మద గుడ్డ ప్రాంతంలో కొండల్లో నెలకొన్న నిజలింగమ్మ - చెన్నబసవణ్ణ దేవత


నిజలింగమ్మ - చెన్నబసవణ్ణ నెలకొన్న ధర్మద గుడ్డ (కొండ) ఇదే

బస్సులన్నీ కిటకిట

30 శాతం పెరిగిన ప్రయాణికులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా వాహనాలన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో సొంతంగా టిక్కెట్లను కొనుగోలు చేసుకునే వారి సంఖ్య రాష్ట్ర వ్యాప్తంగా 30 శాతం పెరిగిపోయింది. అక్టోబరు 10 నుంచి 14 మధ్యలో బెంగళూరు నుంచి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి ఉద్యానగరికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేస్తున్న వారి సంఖ్యను, బుకింగ్ పోకడలను గుర్తించేందుకు రెడ్‌బస్ తాను నిర్వహించిన అధ్యయన నివేదికను మంగళవారం విడుదల చేసింది. బెంగళూరు నుంచి హైదరాబాద్, చెన్నై, కోయంబత్తూరు, పాండిచ్చేరి, గోవాకు వెళ్లేందుకు ఎక్కువ మంది టికెట్లు కొనుగోలు చేసుకున్నారు. రాష్ట్ర పరిధిని పరిగణనలోకి తీసుకుంటే.. బెంగళూరు నుంచి మంగళూరు, ఉడుపి, కుందాపుర, బళ్లారి, గోకర్ణకు అత్యధికంగా టిక్కెట్లు కొనుగోలు చేసుకున్నారు. వీరిలో 45 శాతం మంది ఏసీ బస్సులను, 55 శాతం మంది నాన్-ఏసీ బస్సులను ఎంచుకున్నారు. మడివాళ, మెజెస్టిక్, సిల్కుబోర్డు, యశ్వంతపుర, బళ్లారి రోడ్డు మెఖ్రీ కూడలి వద్ద ఎక్కువ మంది బస్సులు ఎక్కుతున్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

అనాథ మహిళకు పింఛను మంజూరు


నింగమ్మకు పింఛను పత్రాలు అందిస్తున్న ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ప్రతినిధులు

కారటగి, న్యూస్‌టుడే: తాలూకాలోని నాగన్‌కల్ గ్రామ అనాథ మహిళ నింగమ్మకు ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ప్రతినిధులు బుధవారం పింఛను (మాసాశన) మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి తాలూకా యోజనాధికారి నింగప్ప అగసర మాట్లాడుతూ నిరుపేద అనాథలు, వృద్ధులకు ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ప్రతి నెలా రూ.వెయ్యి పింఛను సదుపాయం కల్పిస్తుంది. తమ కార్యాలయంలో ప్రతి నెలా పింఛను ఇస్తామన్నారు. కారటగి తాలూకాలో 45 మందికి పింఛను అందిస్తున్నామన్నారు. యోజన ప్రతినిధులు సంజీవ్, సులోచన, మంజుళ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం సహకరించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న యశవంత్‌రాజ్ నాగిరెడ్డి, నాగళ్ల రమేష్

బళ్లారి : బళ్లారి వాణిజ్య, పరిశ్రమల సంస్థ నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం సహకరించాలని సంస్థ అధ్యక్షుడు యశవంత్‌రాజ్ నాగిరెడ్డి, నైపుణ్య శిక్షణ కేంద్ర అధ్యక్షుడు నాగళ్లి రమేష్ నేతృత్వంలో బెంగళూరులో వైద్య శిక్షణ, నైపుణ్య శిక్షణ శాఖ మంత్రి డా.శరణప్రకాశ్ పాటీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బళ్లారి వాణిజ్య, పరిశ్రమల సంస్థ కొన్నేళ్లుగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ నిర్వహిస్తోంది. నిరుద్యోగులు, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి సహకరిస్తున్నాం. ప్రభుత్వమూ సహకరిస్తే మరిన్ని నైపుణ్య శిక్షణ కోర్సులను ప్రారంభించవచ్చని మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఇక చిరునామా కష్టాలుండవ్


ఆదర్శకాలనీ వీధుల్లో నామఫలకాలు ఏర్పాటు చేయిస్తున్న కౌన్సిలర్ చంద్రు మైలార్

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరుకు కొత్తవారు వచ్చినప్పుడు తమకు కావలసిన చిరునామా కోసం వెతుకులాట ఉండరాదు. ఎలాంటి చిరునామా అయినా లక్కున లభ్యమయ్యేలా వివరాలు తెలిపే నామఫలకాలు ఉండాలని నగరసభ కమిషనర్ మంజునాథ్ గుండూరు పేర్కొన్నారు. ఆయన ఆదర్శకాలనీలో 16వ వార్డు కౌన్సిలర్ చంద్రుమైలార్ ప్రజలకు అనుకూలంగా వార్డులో ప్రతి వీధికి నామఫలకాలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి నామఫలకాలు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డా.రాధాకృష్ణ వీధి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో డా.సుధీర్, నెక్కంటి భాస్కర్, సత్యనారాయణ శెట్టి, హూగార్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన


గంగావతిలో భాజపా సభ్యత్వ నమోదులో పాల్గొన్న జనార్దన్‌రెడ్డి

గంగావతి,న్యూస్‌టుడే: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనతో భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తోందని గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం గంగావతి పట్టణంలో సభ్యత్వ నమోదు అభియాన్‌లో పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు 2న ప్రధాని ఈ అభియాన్‌ను ప్రారంభించారన్నారు. దేశంలో 8 కోట్ల మంది పార్టీ సభ్యులుగా నమోదు కావడం ఒక సంచలనమన్నారు. జిల్లాధ్యక్షుడు నవీన్ గుళగణ్ణవర్, లోక్‌సభ మాజీ సభ్యుడు శివరామగౌడ, పరణ్ణ మునవళ్ళి పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ ఆత్మహత్య

హొసపేటె, న్యూస్‌టుడే: మానసిక వ్యాధితో బాధపడుతున్న గుడిగుడి నేత్రావతి (30) అనే మహిళ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి హరపనహళ్లి తాలూకా సత్తూరులో జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన మంజప్ప కుమార్తె గుడిగుడి నేత్రావతి చాలా కాలం నుంచి మానసిక వ్యాధితో బాధపడుతోంది. రాత్రిపూట ఎప్పుడుపడితే అప్పుడు నిద్రలేచి వెళ్లిపోయేది. ఈ క్రమంలో అందరూ పడుకుని ఉండగా, నిద్రలేచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు అనేకచోట్ల వెతకగా, గ్రామ శివారులోని చెరువులో ఆమె శవం కనిపించింది. ఆకస్మికంగా చెరువులో పడి మృతి చెందినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న అరిసీకెరె పోలీసులు తెలిపారు.

పొగాకు విక్రయాలపై కేసులు నమోదు

హొసపేటె, న్యూస్‌టుడే: బహిరంగ ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయం, వినియోగానికి సంబంధించి పోలీసు, వైద్య శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి 22 కేసులను నమోదు చేశారు. చిత్తవాడ్గి పోలీస్ ఠాణా పరిధిలో కోప్టా చట్టం కింద కేసులు నమోదు చేసి రూ.4వేల జరిమానా విధించారు. బహిరంగ ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయం, వినియోగంపై ఇకపై ఉక్కుపాదం మోపుతామని అధికారులు హెచ్చరించారు. పోలీస్ అధికారులు చౌడప్ప, నాగరాజ్‌నాయక్, సంతోష్, వైద్యశాఖ అధికారి మంజునాథ్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రైల్వే స్టేషన్ వ్యాప్తిలోని హొసపేటె రైల్వే స్టేషన్‌లో విజయపుర-యశవంతపుర ఎక్స్‌ప్రెస్‌లో మరుగుదొడ్ల సమీపంలో మృతిచెందిన గుర్తుతెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఉంటే బళ్లారి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కళాకారుడు పూజార్ చంద్రప్ప మృతి


పూజార్ చంద్రప్ప

హొసపేటె : హరపనహళ్లి తాలూకా అరసీకెరెకు చెందిన ప్రముఖ నాటకరంగ కళాకారుడు, కర్ణాటక నాటక అకాడమీ పురస్కృతుడు పూజార్ చంద్రప్ప (76) మంగళవారం రాత్రి గుండెపోటుతో స్వస్థలంలో మృతిచెందారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో తరగతి చదివిన కళాకారుడు పూజార్ చంద్రప్ప నాటక రంగంలో రాష్ట్రస్థాయిలో పేరు గడించారు. ఆయన ఎక్కువగా స్త్రీ పాత్రల్లో నటించేవారు. దుర్గామాత నాటకంలో ఆయన దేవీపాత్రలో అభినయించారు. ఆ నాటకం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 267 ప్రదర్శనలకు నోచుకోవడం విశేషం. సుమారు 50 నాటకాల్లో ముఖ్య భూమిక పోషించారు. నాటకాలకు దర్శకత్వమూ వహించేవారు. 20 వరకూ పురస్కారాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయి. బుధవారం ఉదయం స్వస్థలంలో అంత్యక్రియలు జరిగాయి.

ఘనంగా యల్లమ్మదేవి విగ్రహం ఊరేగింపు


అమ్మవారి విగ్రహం ఊరేగింపులో భక్తులు

సిరివార, (మాన్వి) : పట్టణ సమీపంలోని యంకనగడ్డ క్యాంపు రోడ్డులో ఉన్న యల్లమ్మదేవి దేవస్థానంలో గురువారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి విగ్రహాన్ని పట్టణంలోని ఊరేగించారు. స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయం నుంచి దేవస్థానం వరకు ఊరేగింపు సాగింది. మహిళలు కుంభ కలశాలతో తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ దేవస్థానం జీర్ణోద్ధరణ కోసం అప్పటి ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ రూ.4 లక్షల విడుదల చేశారని సిరివార తాలూకా దళ్ అధ్యక్షుడు మల్లికార్జున బల్లటగి తెలిపారు. దీంతో ఆలయం పనులు పూర్తి చేసి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, ప్రముఖులు ఆదర్శనాయక్, సూరిదురు గణ్ణనాయక్, అజిత్ హొన్నటగి, మౌలాసాబ్, కృష్ణాజీరావు, దేవేంద్రస్వామి, శివశరణ, కరియప్ప, భైరణ్ణనాయక్, పట్టణ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.


గంగాపరమేశ్వరీదేవికి లలితాదేవి అలంకరణ


మధుర మీనాక్షిగా పార్వతిదేవి


ఏళుమక్కళతాయికి మహాలక్ష్మి అలంకరణ


సరస్వతిగా చిన్నదుర్గమ్మతల్లి


గంగామాతకు రాజేశ్వరీ అలంకరణ


సంతోషిమాతకు దుర్గాదేవి అలంకరణ


మల్నాడుదుర్గమ్మకు పుష్పాలంకరణ


బళ్లారి తాలూకా కృష్ణానగర క్యాంపులో


బళ్లారి నగరం సీతారామ ఆశ్రమంలో సరస్వతిగా


బళ్లారి నగరం కౌల్‌బజార్ కన్యాకా పరమేశ్వర దేవస్థానంలో


గంగాపరమేశ్వరీ ఆలయంలో నవగ్రహహోమ పూజలు


చిన్నదుర్గమ్మ దేవస్థానానికి దీపాలంకరణ


చండీహోమంలో పాల్గొన్న భక్తులు


బళ్లారి నగరంలోని బెంగళూరు రహదారిలోని కన్యాక పరమేశ్వర దేవస్థానంలో..


గంగావతి హేమగుడ్డ దుర్గాపరమేశ్వరి అలంకారం

అక్షరమాతా..పాహిమాం


సింధనూరు గాంధీనగర్ ఆలయంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న వేద పండితులు

బళ్లారి (గ్రామీణ, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారికి ఏడోరోజు మహాసరస్వతిగా అలంకరించారు. గంగాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి లలితాదేవి, పార్వతిదేవికి మధురమీనాక్షి, ఏళుమక్కళతాయికి మహాలక్ష్మి, చిన్నదుర్గమ్మతల్లికి మహాసరస్వతి, గంగామాతకు రాజేశ్వరీగా, సంతోషిమాతకు దుర్గాదేవి, మల్నాడు దుర్గమ్మకు, నీలకంఠేశ్వరి, పుష్పాలతో అలంకరించారు. వాసవీమాతను రుక్మిణీ పాండురంగాస్వామిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. చిన్నదుర్గమ్మ ఆలయంలో దుర్గాష్టమికి విశేషంగా చండీహోమం జరుపుతామని ఆలయ అధ్యక్షుడు తాయణ్ణ తెలిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.

దేవిక్యాంపు (కారటగి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం శ్రీదేవి అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. శ్రీకాళ రాత్రి, సరస్వతీ పూజ, శ్రీరాజశ్యామల హోమం తదితర పూజలు నిర్వహించారు. ప్రసాద వితరణ జరిగింది.

శ్రీరామనగర్: శ్రీరామనగర్‌లో కనక దుర్గాదేవి బుధవారం భక్తులకు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

కంప్లి: కాకతీయనగర్‌లోని గౌసమద్ర మారెమ్మకు విశేష పూజలు జరిగాయి. గురువారం దుర్గాష్టమి నాడు ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సంతర్పణ ఉంటుందని ఆలయ సమితి సభ్యులు తెలిపారు.

హొసపేటె: శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో మిన్నంటాయి. ఊరూ,వాడ అమ్మవారి ఉత్సవాల్లో తలమునకలైంది. దేవీ నామస్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. పట్టణంలోని కబ్బేరుపేటలో గాళెమ్మ, హులిగెమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. మడివాళపేటలో కొలువుదీరిన బన్నిమహంకాళమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు జరుగుతున్నాయి.

సిరుగుప్ప: శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆలయాల్లో పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణం, గ్రామీణ ప్రాంతాలు, తెలుగు క్యాంపుల్లో అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని సరస్వతి, తదితర రూపాల్లో అలంకరించి పూజలు, అర్చనలు నిర్వహించారు.

గాంధీనగర్ (సింధనూరు) : సింధనూరు తాలూకా గాంధీనగర్‌లోని శివ పంచాయతన క్షేత్రంలో దసరా నవరాత్రుల సందర్భంగా లలితా అమ్మవారిని అక్షరదాత సరస్వతీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు రాజశేఖర్‌శర్మ చిన్న పిల్లలకు పలకల మీద ఓం నమశ్శివాయ అనే బీజాక్షరాలు రాయించి అక్షరాభ్యాసం చేయించారు. వెంకటగిరిక్యాంపులోని శ్రీసిద్ధాశ్రమంలోని గాయత్రీ అమ్మవారిని సరస్వతీ మాతగా పూజించారు.

గంగావతి: గంగావతి తాలూకా హేమగుడ్డలో దుర్గాపరమేశ్వరి అమ్మవారి నవరాత్రులు ఘనంగా ఆచరిస్తున్నారు. బుధవారం అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. ఏటా ఈ వేడుకలను శాసనమండలి మాజీ సభ్యుడు హెచ్.ఆర్.శ్రీనాథ్ నిర్వహించడం తెలిసిందే.


వాసవీమాత ఆలయంలో రుక్మిణీ పాండురంగస్వామి అలంకరణ


కురుగోడు పట్టణంలోని నీలకంఠేశ్వర దేవస్థానంలో దేవి విగ్రహానికి విశేషంగా సిరిధాన్యాల అలంకరణ


కారటగి: దేవిక్యాంపు రత్నగిరిపై సరస్వతీ దేవిగా శ్రీదేవి


శ్రీరామనగర్‌లో ప్రత్యేక అలంకరణలో కనక దుర్గాదేవి


శ్రీరామనగర్: విశేష అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి


కంప్లిలోని గౌసమద్ర మారెమ్మ


హొసపేటె: కబ్బేరుపేటలో గాళెమ్మ, హులిగెమ్మ


హొసపేటె: మడివాళపేటలో బన్నిమహంకాళమ్మకు పూజలు


సిరుగుప్ప పట్టాభిరామ ఆలయంలో సరస్వతి దేవిగా


కెంచనగుడ్డ రహదారిలో గాళిమారెమ్మ దేవిగా


సింధనూరు గాంధీనగర్‌లో లలితామ్మవారికి సరస్వతి అలంకారం

నేడు మానసిక ఆరోగ్య దినోత్సవం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా యంత్రాంగం, పలు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు వీఎస్కేయూలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ సభాభవనంలో విశ్వ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.జి.శాంతి, న్యాయమూర్తి రాజేశ్ ఎన్.హొసమని, డీహెచ్‌వో యల్లా రమేష్ బాబు, తదితరులు హాజరవుతారన్నారు.

బీకాంలో ఉత్తమ ఫలితాలు


పి.సుమ వర్ష పట్టణశెట్టి సౌందర్య ఐలి ఎస్.రమ్యశ్రీ

గంగావతి,న్యూస్‌టుడే: బీకాం పరీక్షల్లో గంగావతి కల్మఠ చెన్నబసవస్వామి మహిళా కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 60 మంది పరీక్షలు రాయగా 54 మంది ఉత్తీర్ణులయ్యారు. పి.సుమ 96.30, వర్ష పట్టణ శెట్టి 95.53, సౌందర్య ఐలి 94.92, ఎస్.రమ్యశ్రీ 93.53 శాతంతో ఉత్తీర్ణులైనట్లు ప్రధాన ఆచార్యుడు శరణబసప్ప కోల్కార్ తెలిపారు.

దళితుల ధ్వని .. డాక్టర్ సిద్ధలింగయ్య


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ విద్వాంసుడు సుబ్బు హొలెయార్

హొసపేటె, న్యూస్‌టుడే: జీవితకాలం దళితుల పరమైన గొంతుకగా దళిత కవి డాక్టర్ సిద్ధలింగయ్య పనిచేశారని కర్ణాటక ప్రముఖ విద్వాంసుడు సుబ్బు హొలెయార్ పేర్కొన్నారు. హంపీ వర్సిటీలో బుధవారం దివంగత దళిత కవి డాక్టర్ సిద్ధలింగయ్య జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. సిద్ధలింగయ్య రాసిన 'హొలెమాదిగర హాడు, సామాజిక ప్రేరణె' అనే పుస్తకంలో దళితులకు సంబంధించిన కథ, వ్యధ ఉందని వివరించారు. ప్రతి దళితుడు ఆ పుస్తకాన్ని చదవాలని సూచించారు. దళితులపై జరుగుతున్న వేధింపులు, దౌర్జన్యాలను తన పాటలు, రచనల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చిన ఘనత సిద్ధలింగయ్యకు దక్కుతుందని తెలిపారు. సిద్ధలింగయ్య భార్య రమాకుమారి మాట్లాడుతూ..నేడు సిద్ధలింగయ్య మనతో లేరు, కాని వారి పుస్తకాలు మనను సంరక్షిస్తున్నాయని తెలిపారు. సిండికేట్ సభ్యుడు సోమశేఖర్ బణ్ణదమనె, వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి, కులసచివుడు డాక్టర్ విజయ్ పూణచ్చ తంబండ, దళిత అధ్యయన పీఠం సంచాలకుడు డాక్టర్ చిన్నస్వామి సొసలె, సీనియర్ ప్రాధ్యాపకుడు డాక్టర్ విరుపాక్షి పూజారహళ్లి పాల్గొన్నారు.

నేడు గాంధీ జయంతిపై ప్రత్యేక కార్యక్రమం

హొసపేటె: జిల్లా యంత్రాంగం, సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా 10వ తేదీన ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా బాధ్య మంత్రి బి.జెడ్.జమీర్ అహ్మద్ ఖాన్ ప్రారంభిస్తారు. ఎంపీ తుకారాం, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. ● నేడు జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయం ఆవరణలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్, చిత్రంలో అధ్యక్షుడు శేఖణ్ణ, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ముఖ్య అధికారి హర్షవర్ధన్

బళ్లారి, న్యూస్‌టుడే: కురుగోడు తాలూకా మల్లప్ప కెరె (చెరువు) భూమిని ప్రస్తుతం దున్నుతున్న రైతుల అభిప్రాయం మేరకు కురుగోడు పురసభ జనాభాకు అనుగుణంగా రూ.77 కోట్లతో తాగునీటిని చెరువును నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్ తెలిపారు. పురసభ మూడో సామాన్య సమావేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న శుద్ధి తాగునీటి కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదు. శుద్ధి చేసిన నీటిలోకి మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. మల్లప్ప చెరువును నిర్మిస్తే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. భాజపా సభ్యుడు నరసప్ప యాదవ్ మాట్లాడుతూ విద్యుత్తు స్తంభాలకు పగుళ్లు వచ్చాయి. జెస్కాంకు ఫిర్యాదులు చేస్తే సిబ్బంది కొరత అని ఆలస్యం చేస్తున్నారు. పట్టణ పంచాయతీ అధికారులు సరైన సమయంలో స్పందించడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. కొందరు రహదారిని ఆక్రమించుకోవడంతో చివరిలో నివాసముంటున్న ప్రదేశానికి అంబులెన్స్ వెళ్లడానికి ఇబ్బందిగా మారిందన్నారు. శ్మశానాలను పలువురు ఆక్రమించుకున్నారు. వాటిని తొలగించాలని సభ్యుడు నాగభూషణం, ఇతర సభ్యులు సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. పట్టణ పంచాయతీలో కాంగ్రెస్, భాజపా అనే తేడా లేకుండా సభ్యులకు సమానంగా నిధులు కేటాయించి నగరాభివృద్ధికి సహరించాలని భాజపా సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. పురసభ అధ్యక్షుడు శేఖణ్ణ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డులో సంచరించి స్థానిక ప్రజల విజ్ఞప్తులు స్వీకరించి సమస్యలను అక్కడే పరిష్కరించడానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ముఖ్య అధికారి హర్షవర్ధన్, పురసభ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్

చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన అవసరం

హొసపేటె, న్యూస్‌టుడే: చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉందని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్. దివాకర్ పేర్కొన్నారు. పర్యావరణ నిర్వహణ, విధాన పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇండోర్ స్టేడియంలో చెత్త నిర్వహణపై స్థానిక సంస్థల సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రదేశాలు విస్తరిస్తున్న కొద్దీ చెత్త నిర్వహణ పెనుసమస్యగా మారుతోంది. రోజూ స్థానిక సంస్థలు ఇంటింటికీ వాహనాలను పంపుతున్నా, ప్రజలు చెత్తచెదారాన్ని ఇంకా రోడ్లపైనే పారవేస్తున్నారు. వారిలో మార్పు, జాగృతి రానిదే ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా వృథా అని అన్నారు. చెత్త నిర్వహణలో ప్రజా భాగస్వామ్యం చాలా అవసరమని నొక్కిపలికారు. జిల్లా ప్రణాళిక సంచాలకుడు ఎన్.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

09-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10993	2022
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,573	9,435
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	50.846

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

రాజధానిలో నవ్యమార్గం
మెట్రో మణిహారం!


నిత్యం.. వాహన రణగొణధ్వనుల మధ్య రాకపో కలు సాగించడం ఆ మార్గంలో ఉద్యోగులకు పెద్ద భారంగా మారింది. శాస్త్ర, సాంకేతిక- జీవ సాంకే తిక పరిశ్రమలకు నెలవైన ఎలక్ట్రానిక్‌సిటీ, హోసూ రురోడ్డు వాడలను కలిపే రహదా రులు వాహనాలతో కిక్కిరిసి పోవడం పెను సమస్య లకు మూలం. ట్రాఫిక్ ఇక్కట్లను అధిగమించడానికే సిద్ధమైన పసుపు పచ్చ మెట్రో మార్గం ఆధునిక పోకడలకు దర్ప ణంగా నిలువనుంది. ఐటీ, బీటీ ఉద్యోగు లకు వరంలా మారబో తోంది!


చోదకుడి అవసరంలేని మెట్రో రైలు ఇదే

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగ రంలో నమ్మ మెట్రో ఐదో అంకం (రిచ్-5) పసుపుపచ్చ నడవా (ఎల్లో కారిడార్) ప్రయాణికుల సేవలకు సిద్ధమైంది. అన్ని రకాల పరీక్షలను పూర్తి చేసుకుంది. చైనా, భారత్ సాంకేతిక నిపుణులు సంయుక్తంగా ఈ మార్గాన్ని పూర్తి చేశారు. బొమ్మనహళ్లి- ఆర్వీ రోడ్డు మధ్య 18.82 కిలోమీటర్ల పొడవైన ఉపరితల వంతెనపై చోదకుడి అవసరమే లేకుండా పరుగులు తీసే మెట్రో రైలును సిద్ధం చేశారు. వచ్చే ఏడాది జనవరి నుంచి మూడు వాహనాలను పట్టాలెక్కించ బోతున్నారు. ఆ మార్గంలో అధికారికంగా సంచారా నికి సర్వం సిద్ధమైనట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు ప్రకటించారు. అత్యాధునికంగా రూపొందించిన మూడు రైళ్లు అందుబాటులో ఉన్నాయని, ప్రతి 30 నిమిషాలకు ఓ రైలు ఇటుగా సంచరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మే నెల నుంచి ప్రతి పది నిమిషా లకు ఓ వాహనం పట్టాలపైకి రానుంది. రెండేళ్ల పాటు వాటిలో తాత్కాలిక పర్యవేక్షణకు డ్రైవర్లు అందుబాటులో ఉంటారు. వారి విధులు నామకేవాస్తిగా ఉంటాయి. సివిల్, సిస్టమ్ పనులు 99 శాతం పూర్తి చేశారు. జూన్ నుంచి మూడునెలల పాటు డ్రైవర్ రహిత వాహనానికి అను బంధంగా బోగీలను అమర్చి వాటి పని తీరు, పట్టాల వ్యవస్థ, బ్రేకింగ్, సిగ్నల్, సమాచార వ్యవస్థలను సాంకేతిక నిపుణులు పరిశీలించారు. అన్ని రకాల తనిఖీలూ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. బొమ్మ నహళ్లి, హెబ్బగోడి హోసూర్ రోడ్డు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ (కోణ ప్పనఅగ్రహార), హోసరోడ్డు, సింగసంద్ర, ఎలక్ట్రానిక్ సిటీ, కూడ్లు గేట్, హొంగసంద్ర, సెంట్రల్ సిల్క్‌బోర్డు, బీటీఎం లేఔట్, జయ దేవ ఆసుపత్రి, రాగిగుడ్డ, ఆర్.వి.రోడ్డు ప్రయాణ ప్రాంగణాల వరకు వ్యవస్థను పరీక్షించారు. డిసెంబరులో కేంద్ర మెట్రో రైలు సురక్షిత కమిషన్ వచ్చి మరోసారి తనిఖీలు చేయనుంది. ఆపై. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మెట్రో ప్రారంభ తేదీలను ఖరారు చేస్తాయి. కొత్త వ్యవస్థ ఫలితంగా ఐటీ కార్యాలయాల నడవాలో ట్రాఫిక్ ఇక్కట్లు సమసిపోనున్నాయని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.


సిద్ధమైన ఎలక్ట్రానిక్ సిటీ మెట్రోస్టేషన్


హోసూరు రోడ్డుకు చేరువగా బొమ్మసంద్ర ప్రయాణ ప్రాంగణం


ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతంలో మెట్రో ఉపరితల వంతెనలు



పచ్చని చెట్ల మధ్య నిర్మించిన పసుపుపచ్చ మార్గం

అక్షరాలే అలంకారాలు
చిరునవ్వులే ఆభరణాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : శ్వేతాంబరధరే దేవి కర వీణాలంకార భూషితే జగస్తుతే జగన్మాతా మహాస రస్వతి నమోస్తుతే... అంటూ విద్యార్థులు, పండితులు, సిద్ధ గంధర్వులు, కళాకారులు ఏకకాలంలో సరస్వతీ మాతను మన సారా ప్రార్థించారు. శుక్రవారం బుధవారం- నవరాత్రి ఏడోరోజు ఆదిశక్తి- సరస్వతీ అవతారమెత్తి దుష్టశిక్షణ చేస్తూ శిష్టులను రక్షిస్తూ వారికి జ్ఞాన, విద్యాదాన్ని ప్రసాదిస్తుంది. సరస్వతీ దేవి అంటే ప్రతి వారికీ భక్తి, శ్రద్ధ, విశ్వాసం. ఆమె ఎంతో సౌమ్య మూర్తి, జ్ఞానప్రద, శుభప్రద, శుభ్ర శ్వేతాంబర ధారిణి. సదా చిరునవ్వులే ఆమె ఆభరణాలు. అలాంటి ఆ మాతను హృదయపూర్వకంగా ప్రార్థిస్తే చాలు.. జ్ఞాన విద్యాని అన్ని శుభ లక్షణాలు ప్రసాదిస్తుంది. అమ్మ కరుణాకటాక్షాన్ని పొందినవారు సమాజంలో కవి, పండిత, కళాకారులుగా మహా విద్యాంసులుగా ఎంతో గౌరవానికి- పూజ్యానికి పాత్రులౌతారు. సరస్వతీమాత కరుణాకృపాదులకు పాత్రమవ్వాలన్నది ప్రతివారి ఆకాంక్ష. సంగీత, నృత్య, సాహిత్యాది కళలకు అధిదేవత సరస్వతీమాత. సదా వీణాధారిణి. ప్రసన్నవదనంతో విరాజిల్లుతుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో అమ్మవార్లను ఇదే అలంకారంలో పూజించారు. బెంగళూరులోని బనశంకరిదేవి, శారదాంబ రీమాతలు వీణాధారులై దర్శనమిచ్చారు. చారిత్రక చిక్కమగళూరు జిల్లా హొరనాడు గిరిధామంపై అన్నపూర్ణేశ్వరి అశ్వారూఢ మాతగా దర్శనమిచ్చారు. మంగళూరు మంగళాదేవి, బెంగళూరు గవిగంగాధరేశ్వర ఆలయంలో దుర్గాపరమేశ్వరి, అంబాభవానీ, బండే మహంకాళి, శేషమహాగణపతి ఆలయ పార్వతీదేవి.. ఇలా మాతలందరిదీ అక్షర లక్షల వైభవమే!


వీణా ధారిణి బనశంకరిమాత


చిక్కమగళూరు : హొరనాడు అన్నపూర్ణేశ్వరి


బెంగళూరులో శాంకరిదేవికి విశేషాలంకరణ



బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

- బీన్స్- 90
- క్యారెట్- 65
- బీరకాయలు- 40
- క్యాబేజి- 20
- కాలీఫ్లవర్(ఒక్కోటి)- 25
- సొరకాయ- 30
- దొండకాయలు- 28
- పొట్లకాయ- 35
- టమాటా(నాటు)- 110
- గుమ్మడి- 55
- ఆలుగడ్డ- 45
- ఉల్లి (మేలురకం)-85
- ఉల్లి (సాధారణ)- 50
- వెల్లుల్లి - 405
- సాంబారు ఉల్లి- 120
- బీట్‌రూట్- 25
- వంకాయలు- 35
- బెండకాయలు- 28
- ముల్లంగి- 40
- నిమ్మకాయ- 250
- వాషింగ్టన్ ఆపిల్-315
- సిమ్లా ఆపిల్- 135
- గ్రీన్ ఆపిల్- 335
- అరటి కాయలు- 55

కిత్తూరు వీర రాణి..
సాహస చరితకే పారాణి


కిత్తూరు పాలకులు, సైనికుల దుస్తులు


చెన్నమ్మ సాహసాన్ని తెలిపే ఓ చిత్తరువు


సైనికులు ఉపయోగించిన ఆయుధాలు

బెళగావి, న్యూస్‌టుడే : సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు బ్రిటిష్ వారితో పోరాడిన వీర రాణి చెన్నమ్మ స్వాతంత్ర్య సమరయోధురాలిగా చరిత్ర పుటల్లో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. సైన్యాధి పతి సంగొళ్లి రాయణ్ణతో కలిసి బ్రిటిష్ సైనికులను ఆమె ముప్పుతిప్పలు పెట్టి, మూడు చెరువుల నీరు తాగించడం ఓ చరిత్ర. భారత్‌లో సామ్రా జ్యాన్ని విస్తరిస్తున్న సమయంలో బ్రిటిషర్లను మొదటిసారిగా చెన్నమ్మ నిలువరించడం సాహసఘట్టాల సమాహారమే. ఆమె చేసిన పోరాటానికి రెండు శతాబ్దాలు నిండాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23-25 వరకు కిత్తూరు ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసుకుంటోంది. కిత్తూరు రాణి చెన్నమ్మ పోరాటాన్ని, అప్పటి సైనికులు, ప్రజల దుస్తులు, జీవనశైలిని తెలిపేం దుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ మ్యూజియాన్ని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1967 జనవరి 10న ప్రారంభించారు. పురావస్తు శాఖ ఈ వస్తు సంగ్రహా లయాన్ని నిర్వహిస్తోంది. నాటి ముఖ్యమంత్రి ఎస్‌ఆర్ కంఠి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాలుగు గ్యాలరీల్లో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. కిత్తూరు సంస్థానానికి చెందిన వస్తువులు ఒక విభాగంలో చూడొచ్చు. చెన్నమ్మ వర్ణ చిత్రాలు మరో భవంతిలో అమర్చారు. మరో రెండు గ్యాలరీల్లో శిల్పాలు, ఆయుధాలు, పాతకాలం తాళాలు, ఆభరణాలు, కంకణాలు, ఫిరంగి గుండ్లు, కుండలు, కిత్తూరు రాజుల వంశవృక్షం, శాసనాలు తదితరాలను ఆవిష్కరించారు. యుద్ధానికి వెళుతున్న కిత్తూరు సైన్యం, సైన్యానికి నేతృత్వం వహిస్తున్న సంగొళ్లి రాయణ్ణ, బ్రిటిష్ సైనికులను బంధించి తీసుకువెళ్లడం, బ్రిటిష్ పిల్లలతో రాజప్రాసాదంలో రాణి చెన్నమ్మ ఆడుకుంటూ ఉన్న చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. విద్యార్థులు, చరిత్రకారులు, స్థానికులతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ మ్యూజియానికి వచ్చి వెళుతున్నారు. గత ఏడాది 65 వేల మంది ఇక్కడకు వచ్చారు. కిత్తూరు ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో మ్యూజియా నికి సందర్శకులు వస్తారని అంచనా వేసుకున్నామని క్యూరేటర్ రాఘవేంద్ర ధీమా వ్యక్తం చేశారు. వారంలో అన్ని రోజులూ తెరచి ఉండే ఈ మ్యూజియం ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సందర్శించే వీలు కల్పించారు. బాలలకు రూ.5, పెద్దలకు రూ.10 చొప్పున టికెట్ ధర ఉండగా.. ప్రతి నెలా రూ. 60 వేలు టికెట్ల రూపంలోనే ఆదాయం వస్తున్నట్లు రాఘవేంద్ర వివరించారు.


రాణి చెన్నమ్మ సాహస ఘట్టాలు వీక్షిస్తున్న విద్యార్థులు



హుబ్బళ్లి నడిబొడ్డున రాణి చెన్నమ్మ కూడలి

ఇన్‌స్టాగ్రాం ప్రేమ పిచ్చి చివరికి.. గర్భందాల్చి..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన ఓ వ్యక్తి.. ప్రేమిస్తున్నట్లు నమ్మించి రెండుసార్లు వరుసగా లైంగికదాడికి పాల్పడినట్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ యువతి (30) బెంగళూరు గోవిందపుర ఠాణా మెట్లెక్కారు. కేరళకు చెందిన బిలాల్‌రఫీక్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆమె నగరంలో సాఫ్ట్‌నర్సుగా పని చేస్తున్నారు. 2021లో ఇన్‌స్టాగ్రామ్‌లో బిలాల్ రఫీక్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఫోన్ నెంబర్లను మార్చుకుని.. మాటలు కలిపారు. ఆపై ప్రేమంటూ ఆ వ్యక్తి నమ్మబలికినట్లు బాధితురాలు వాపోయారు. ఈ చనువుతోనే రెండుసార్లు లైంగిక దాడికి తెగించడంతో గర్భం దాల్చినట్లు చెప్పగా.. దాన్ని ఆ వ్యక్తి కారణంగానే విచ్ఛిన్నం చేసుకున్నట్లు వివరించారు. పెళ్లి చేసుకునేందుకు అంగీకరించి, నా వద్ద నగదు, బంగారు నగలు తీసుకున్నాక నిరాకరించాడని ఆరోపించారు. అసభ్యంగా తిట్టడంతో పాటు కులం పేరుతో దూషించి అవమానించాడని ఫిర్యాదులో వివరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బిలాల్ రఫీక్‌ను బుధవారం అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

నిండుగా విపణి లోగిళ్లు.. జోరుగా కొనుగోళ్లు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మహానవమి, ఆయుధపూజకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. బూడిద గుమ్మడికాయలు, బంతిపూలు, బొరుగులు, బూందీ, మిఠాయిలు, నూతన దుస్తుల విక్రయాలతో బెంగళూరు మార్కెట్లు రద్దీగా మారాయి. గత వారం వరకు కిలో రూ.50 పలికిన బూడిద గుమ్మడికాయలు టోకున కిలో రూ.30కు అందుబాటులోకి వచ్చాయి. చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా బూడిద గుమ్మడికాయలు నగరానికి రావడంతో ధరలు కాస్త తగ్గాయి. బంతి, చేమంతి కిలో రూ.100కు చేరుకున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా గురు, శుక్రవారాల్లో ధరలు కొంత పెరిగే అవకాశం ఉంది. సెలవులు రావడంతో నగరవాసి తమ సొంతూళ్లకు బయలుదేరాడు. సొంత వాహనాల్లో వెళుతుండడంతో అన్ని టోల్‌గేట్ల వద్ద రద్దీ నెలకొంది. మైసూరు, ఇతర జిల్లాలు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళలోని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ రెండు వేలకు పైగా అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలను రెట్టింపు చేశాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద రద్దీ పెరిగింది. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగానే బొమ్మల కొలువులను ఏర్పాటు చేసుకున్నారు. తాము ఏర్పాటు చేసుకున్న బొమ్మల కొలువులను ఇరుగుపొరుగులు, స్నేహితులు, బంధువులను ఆహ్వానించి చూపుతున్నారు.


బొమ్మల కొలువు చూసేందుకు వచ్చిన యువతులు, మహిళలు


పండగ వేళ బూడిదగుమ్మడికాయలు బెంగళూరు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి

యువత ఆరోగ్య రక్షణే లక్ష్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటి వినియోగం మానసిక, శరీరక ఆరోగ్యానికి నష్టదాయకమంటూ బెంగళూరు జ్ఞానభారతి ప్రాంగణంలో జాతీయ న్యాయ కళాశాల విద్యార్థులు బుధవారం ప్రత్యేకంగా వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీసులు నేతృత్వం వహించారు. యువత మత్తులో ఉంటే సమాజం అభివృద్ధి చెందబోదని కళాకారులు హెచ్చరించారు. మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని హితవు పలికారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను నిషేధించామని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.


జ్ఞానభారతిలో వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దేవదేవుళ్ల వేడుక!

శరన్నవరాత్రులను పురస్కరించుకుని కోలారు జిల్లాలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహణ కొనసాగింది. కోలారు నగర దేవత కోలారమ్మకు విశేష పూజలు కొనసాగాయి. ముళబాగిలు సూర్యనారాయణ స్వామి ఆలయంలో మూల విరాట్ విగ్రహాన్ని నాణేలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముళబాగిలు తాలూకా ఖాద్రీపురలోని శని మహేశ్వర స్వామిని బంతిపూలు, నిమ్మకాయల దండలతో, రత్నాలు పొదిగిన కిరీటంతో అలంకరించారు. శ్రీనివాసపురలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు వరాహి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నంగలిలో నిర్వహించిన సరస్వతి పూజలో నవదుర్గల విగ్రహాలను తీర్చిదిద్దారు. కొందరు భక్తులు ఇళ్లలో తయారు చేసుకు వచ్చిన ప్రసాదాన్ని ఆలయాలకు వచ్చిన వారికి వితరణ చేశారు.

-న్యూస్‌టుడే, కోలారు


నాణేల అలంకరణలో సూర్యనారాయణ స్వామి


వరాహిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి కొలువు


పూలు, నిమ్మకాయలతో శనిమహేశ్వరుడికి నవ్యరూపం


నంగలిలో నవదుర్గలకు సరస్వతి పూజ

వినయ్ కులకర్ణిపై మహిళ ఆరోపణలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మాజీ మంత్రి, ధార్వాడ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి తనను లైంగికంగా వేధించారని ఒక మహిళ ఆరోపించింది. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు. ఆమె ఒక రైతు మహిళ అని, తనతో రెండు మూడుసార్లు వీడియో కాల్‌లో మాట్లాడిందని చెప్పారు. తనపై ఉన్న హత్య కేసులో సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారని, అందులోనూ నిజం లేదని ఆక్రోశించారు.

నాగేంద్ర విచారణకు అనుమతి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన నగదును వేర్వేరు ఖాతాలకు అక్రమంగా బదిలీ చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి బి.నాగేంద్రను విచారించేందుకు ఈడీకి అనుమతి ఇస్తూ చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం అనుమతించింది. నాగేంద్రతో కలిపి ఐదుగురిని విచారిస్తామని అనుమతి కోరుతూ ఈడీ పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు స్పందించింది.

శని మఠానికి నిప్పు

మండ్య, న్యూస్‌టుడే : శ్రీరంగపట్టణ తాలూకా కేఆర్‌ఎస్ సమీపంలోని శని మఠానికి కొందరు దుండగులు మంగళవారం రాత్రి నిప్పు పెట్టారు. మంటల్ని చూసిన స్థానికులు మఠం ఆవరణలోని గోవులు, వృద్ధాశ్రమంలోని వృద్ధులను రక్షించారు. రెండు వాహనాలతో వచ్చిన అగ్నిమాపకదళ సిబ్బంది మంటల్ని ఆర్పారు.

ముత్యాలజల్లు

కొనసాగుతున్న వర్షాల కారణంగా బెంగళూరు నగర శివార్లలో ముత్యాలమడుగు జలపాతం జోరందుకుంది. కొండ పైనుంచి రెండు వందల అడుగుల దిగువకు జాలువారే జల్లులు నయన మనోహర దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాన్ని వీక్షించడానికి నగర ప్రజలు పోటీపడుతున్నారు. జలపాతం వద్దకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు లేకపోయినా ఔత్సాహికులు సొంత వాహనాల్లో కదలివెళుతున్నారు. ప్రస్తుత దసరా సెలవుల్లో ఇక్కడికి చేరుకునే వారి సంఖ్య పెరుగుతోంది. జలపాతం జోరు కారణంగా మరీ చేరువగా వెళ్లకుండా నిబంధనలు విధించారు. ఓ కొండ మార్గంలో జలపాతం చెంతకు చేరుకోవడం ఒకింత సాహసంతో కూడుకున్న పనే. బెంగళూరు శివారు ఆనేకల్లు నుంచి జిగణి వెళ్లే మార్గంలో ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణిస్తే ముత్యాలజల్లు హొయలన్నీ వీక్షించవచ్చు.

-న్యూస్‌టుడే, బెంగళూరు యశ్వంతపుర


ముత్యాలమడుగు జలపాత హోరు


జలపాతానికి చేరుకునే కీకారణ్య మార్గం

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

అలరించిన నృత్య వేదికలు



నృత్య విద్యార్థినుల బృందం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బుధవారం నగరంలో కెనరాబ్యాంక్ కాలనీకి చెందిన వరసిద్ధి వినాయక దేవాలయం, సుముఖ సంపద చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నృత్య కార్యక్రమాన్ని నిర్వహించాయి. నృత్య పరిశోధకురాలు, నృత్య విదుషి డాక్టర్ దర్శిని మంజునాథ్ నేతృత్వంలో నృత్యధిశా ట్రస్టు విద్యార్థినులు తమ నృత్య కళా పాటవాల ప్రదర్శనతో వీక్షకులను అలరించారు. సంస్థ సీనియర్ కళాకారులు ఉమా, కార్తికేయ వాఖాతలుగా వ్యవహరించారు. అనంతరం నిర్వాహకులు నృత్య విద్యార్థినులను అభినందించి సత్కరించారు.

ఆకట్టుకుంటున్న కమలం, నెమలి



బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దసరా, దీపావళి సందర్భంగా ప్రజలను ఆకట్టుకునే విధంగా నగరంలోని యశ్వంతపురలోని ఓ మాల్‌లో కమలం, నెమలి బొమ్మలను ఏర్పాటు చేశారు. నీటి కొలనులో 18 అడుగుల హంస, కమలం, 22 అడుగుల ఎత్తు కలిగిన నెమలి ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలను అలంకరించారు. హంస, కమలం నీటిలో తేలాడుతున్నాయి. మాల్ బయట విద్యుద్దీపాలను అలంకరించి ఆకట్టుకునే విధంగా చేశారు. ఉత్సవాలు నవంబరు 3 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

హో సూ రు క బు ర్లు

జాతీయ పోటీల్లో సత్తాచాటిన లక్ష్మీచరణ్

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు తాలూకా బుక్కసాగరం సమీపం ఆలూరు గ్రామ పంచాయతీలోని ఆబిరి గ్రామానికి చెందిన శివకుమార్, జమున దంపతుల కుమారుడు ఎస్. లక్ష్మీచరణ్ కృష్ణగిరి సమీపంలోని కుందారపల్లిలో సరస్వతి విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నాడు. దిల్లీలో జరిగిన జాతీయ ఎయిర్ రైఫిల్ పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం గెలిచాడు. భారత్ స్పోర్ట్స్ అకాడమి నిర్వాహకుడు ఎస్. ఎ. రహమత్ శిక్షణ ఇచ్చాడు. విద్యార్థిని సరస్వతి విద్యాలయ అధిపతి అన్బరసన్, ఉపాధ్యాయులు, హోసూరు కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు లోకేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఫోర్స్ రామస్వామి తదితరులు అభినందించారు.



విజేత లక్ష్మీచరణ్‌కు పతకం అందజేస్తున్న ప్రముఖులు

హరియాణాలో విజయంపై భాజపా సంబరాలు

బేరికె, న్యూస్‌టుడే : హరియాణాలో భాజపా విజయం సాధించడంపై ఇక్కడి భాజపా నాయకులు,కార్యకర్తలు సంబరాలు చేసుకొని విజయోత్సవం నిర్వహించారు. భాజపా జిల్లా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద టపాసులు పేల్చారు. ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు పి. మంజుళ, వరలక్ష్మి, మురుగన్, ప్రవీణ్, పి. ఎస్. మణి, కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయోత్సవంలో భాజపా నాయకులు, కార్యకర్తలు

11న మినీ మారథాన్

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న ఉదయం 7 గంటలకు మినీ మారథాన్‌ను మంత్రి జి. పరమేశ్వర్ ప్రారంభిస్తారని జిల్లాధికారి శుభాకల్యాణ్ తెలిపారు. నగరంలోని మహాత్మా గాంధీ క్రీడా మైదానం నుంచి ప్రారంభమైన మారథాన్ శివకుమార్ స్వామీజీ సర్కిల్, ఎస్ఐటీ కళాశాల, గంగోత్రి రహదారి, ఎస్. ఎస్. పురం మెయిన్‌రోడ్డు, భద్రమ్మ సర్కిల్, బి. జి. ఎస్. సర్కిల్, గుబ్బిగేట్, దిబ్బూరు క్రాస్, డబుల్‌రోడ్డు, అమాని చెరువు రోడ్డు, జిల్లాధికారి కార్యాలయం, కేఈబీ కల్యాణ మంటపం, కోతి తోపు, తమ్మయ్య హాస్పటల్ మీదుగా ఎంజీ స్టేడియంలో ముగుస్తుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి ఆరుగురు పురుషులు, ఆరుగురు మహిళలను విజేతలుగా ప్రకటిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 6 వేలు అందజేస్తామని వివరించారు. సమావేశంలో కమిషనర్ బి. వి. అశ్విజ అదనపు జిల్లాధికారి ఎన్. తిప్పేస్వామి, జిల్లా పారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ లింగరాజు, ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాధికారి శుభాకల్యాణ్, అధికారులు

వ్యక్తి దారుణ హత్య


పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని కసబ హోబళి మురారాయనహళ్ళి గ్రామంలో కురుబ చిక్కప్ప కుమారుడు మల్లయ్య (55) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్య గతంలో భార్యను హత్య చేసి జైలుకు వెళ్ళాడు. మూడు నెలల క్రితం విడుదలై వచ్చాడు. గ్రామంలోని ఒక మహిళతో అక్రమ సంబంధం ఏర్పరచుకొన్నాడని ఆగ్రహించిన ఆ మహిళ భర్త , కుమారుడు కలిసి మల్లయ్యను హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మల్లయ్య

ఆకర్షించే బొమ్మల కొలువు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని సంజయనగరలో నివశిస్తున్న తెలుగు విజ్ఞాన సమితి ఉపాధ్యక్షుడు గంగరాజు ఇంట్లో దసరా బొమ్మలు కొలువు ఏర్పాటు చేశారు. నవరాత్రుల సందర్భంగా ఏటా ఆయన కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో దసరా బొమ్మలు కొలువు ఏర్పాటు చేయడం అనవాయితీగా మారింది. దసరా నవరాత్రులను కుటుంబ సభ్యులు ఉపవాసాలతో కూడిన పూజలు నిర్వహిస్తారు. అన్ని రకాల దేవతామూర్తుల విగ్రహాలను కొలువులో ఉంచారు. చాలా ఏళ్ల నుంచి దసరా బొమ్మలు కొలువు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని గంగరాజు తెలిపారు.



గంగరాజు ఇంట్లో బొమ్మలు కొలువు

చక్కని స్పందన



బొమ్మల కొలువులో గృహిణులు

చిక్కబళ్లాపుర : నగర్తరపేట ప్రమెల్లా వీరనాగ్ తన ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువుకు చక్కని స్పందన లభిస్తోంది. అక్కమహాదేవి మహిళా సంఘం మహిళలు ఇక్కడ నిత్యం లలితా సహస్రనామం, మహిషాసుర మర్ధిని, సౌందర్యలహిరి పారాయణంతో పాటు భజనలు చేసి వెళుతున్నారు. రెండు దశాబ్దాలుగా తాను సేకరించిన బొమ్మలను వీక్షించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని ప్రమెల్లా తెలిపారు.



సర్జాపుర రహదారిలో గుంతలను పూడ్చుతున్న పాలికె సిబ్బంది



కుందనహళ్లిలో మట్టి వేయిస్తున్న సంచార పోలీసులు

రహదారుల దుస్థితిపై ఫిర్యాదులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగర రహదారుల దుస్థితిపై నిత్యం ఎనిమిది వందలకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఫిర్యాదుల ఆధారంగా వాటిని పరిశీలించి రహదారుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చుతున్నట్లు పాలికె అధికారులు తెలిపారు. రహదారుల దుస్థితి, నిర్వహణపై ప్రజలు ఛాయాచిత్రాలతో కూడిన వివరాలను పాలికె ఉన్నతాధికారులకు వాట్సాప్ ద్వారా పంపిస్తున్నారు. ఆఖరికి చీఫ్ కమిషనర్ చరవాణికి చిత్రాలు వస్తున్నాయి. గుంతలు పూడ్చేందుకు గతంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన గడువు పూర్తి అయింది. గుంతలు పూడ్చుతున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో పనులు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు మళ్లీ రహదారులు పాడవుతున్నాయి. కొత్తగా పడిన గుంతలకు సంచార పోలీసులు మట్టి వేసి పూడ్చి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గుంతలకు తారు మిశ్రమం వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు బురదమయం కావడంతో ప్రజలు సంచరించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రోజు వివిధ ప్రాంతాల్లో వందకు పైగా గుంతలు పూడ్చుతున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక సంస్థలు, ప్రజల నుంచి ఒత్తిళ్లు వచ్చే ప్రాంతాల్లోని రహదారుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పెద్ద గుంతలను పూడ్చుతున్నట్లు అధికారులు సమాధానం ఇచ్చారు. కురుస్తున్న వర్షాలకు పడిన గుంతల వివరాలను పాలికె సిబ్బంది సేకరిస్తున్నారు.

మూన్నాళ్ల ముచ్చటే

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలో నెలరోజులుగా రహదారుల మరమ్మతు, గుంతలను పూడ్చే ప్రక్రియను పాలికె సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన నిర్వహించారు. ఈ పనులన్నీ మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. గత శనివారం నుంచి సోమవారం వరకు కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో మరమ్మతు చేసి వేసిన తారు, కంకర వర్షం నీటితో కొట్టుకుపోయాయి. మరికొన్ని చోట్ల వర్షం నీరు వెళ్లే డ్రైన్లపై ఉంచిన ఇనుప జల్లెడలు చోరుల పాలయ్యాయి. కొన్ని డ్రైన్లలో చెత్త పేరుకుపోగా, చాలా చోట్ల స్థానికులు వాటిపై అడ్డుగా సిమెంటు దిమ్మెలను ఉంచారు. నాశిరకం పనులు చేసి కోట్లాది రూపాయలకు బిల్లులు పెట్టుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించకపోతే దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామని పార్టీ నాయకుడు మోహన్ దాసరి హెచ్చరించారు.



గుంతకు అడ్డుగా వేసిన సిమెంట్ దిమ్మెలు



గుంతపై కనిపించని జల్లెడ

తుమకూరు ఉత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు జిల్లాలో మొదటి సారిగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు విచ్చేయాల్సిందిగా జిల్లాధికారి శుభాకల్యాణ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఆహ్వాన పత్రికను అందించారు. జడ్పీ సీఈఓ జి. ప్రభు, పాలికె కమీషనర్ బి. వి. అశ్విజలతో కలసి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి భేటి చేసి ఆహ్వానించారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అమరశిల్పి జక్కణాచార్య వేదికలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు.



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న జిల్లాధికారి శుభాకల్యాణ్ తదితరులు



ర్యాలీలో పారిశుద్ధ్య అధికారులు, కార్మికులు, విద్యార్థులు

స్వచ్ఛతపై ప్రజల్లో చైతన్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలో బొమ్మనహళ్లి పాలికె విభాగంలో పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యార్థులతో కలిసి బుధవారం ఇక్కడ స్వచ్ఛత పనులు చేపట్టారు. విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు చీపుర్లు చేతపట్టి రహదారులను ఊడ్చారు. పోగు చేసిన చెత్తను వాహనాల్లో తరలించారు. అనంతరం స్వచ్ఛత, పరిశుభ్రతను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రధాన రహదారుల్లో బ్యానర్లు చేతపట్టి ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యవంతులు చేశారు. పరిశుభ్రత వల్ల అంటువ్యాధులను దూరం చేయవచ్చునని తెలిపారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు పేదలకు ఉచితంగా ఆధునిక వైద్యం చికిత్స అందేలా చేసారని కాటన్‌పేట బ్లాక్ కాంగ్రెస్ సమితి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం గాంధీనగరలో కాటన్‌పేట బ్లాక్ కాంగ్రెస్ సమితి తరపున దినేష్ గుండూరావు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గాంధీనగర విధానసభా క్షేత్రాన్ని మాదరి క్షేత్రంగా చేశారని, అన్ని సముదాయాల నాయకుడిగా పేరుగాంచారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల బాలలకు ఐదు వేల రూపాయలు, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు సుధాకర్ అడప్ప, మాజీ పాలికే సభ్యుడు రామచంద్ర, శశి, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో శ్రీనివాసమూర్తి తదితరులు

రోడ్డు పనులకు భూమిపూజ

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : దాసరహళ్లి నియోజకవర్గం చిక్కబాణవార పురసభ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే మునిరాజు భూమిపూజ చేశారు. విశ్వేశ్వరయ్య బడవాణి, శాంతినగర, గణపతినగర్, కమ్మహళ్లి, శరగుడ్డనహళ్లిలో నాయకులతో కలసి పనులు ప్రారంభించారు. రహదారి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, మరిస్వామి, చిక్కన్న, పురసభ అధికారి కుమార్, బీబీఎంపీ అధికారులు పాల్గొన్నారు.



రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు, తదితరులు

దుర్గాదేవికి ఎమ్మెల్యే రిజ్వాన్ పూజలు



దుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని రామస్వామిపాళ్యలో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన దసరా పూజా కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యుడు రిజ్వాన్‌హర్షద్ హాజరయ్యారు. అక్కడ ఆయన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. దసరా ఉత్సవాలను ప్రజలందరు సంతోషంగా నిర్వహించుకోవాలని, అందరు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కృష్ణగౌడ, ఆనందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి ఇంటర్ హైస్కూల్ బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యానగరకు చెందిన డీవైఈఎస్ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్ బాలికల జట్టు విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించిందని కర్ణాటక బాస్కెట్‌బాల్ సంఘం బుధవారం తెలిపింది. మంగళవారం సాయంత్రం ధార్వాడలో ముగిసిన ఈ పోటీ లీగ్ చివరి మ్యాచ్‌లో విద్యానగర బాలికల జట్టు 41-28 పాయింట్ల తేడాతో బెంగళూరు డివిజన్ జట్టుపై గెలుపొంది జ్ఞాపికను దక్కించుకొంది. ధన్యా, వైష్ణవీ, ఇషితాగౌడ, శీతల్, నీరీక్ష శ్రేయా ఆర్. గౌడ, వర్షిణి, చైత్రా రామనాయక్, విభా, సమీక్షన్ శ్రేయ చక్కని ఆట ప్రదర్శనతో ఛాంపియన్స్‌గా అవతరించారు. పోటీల ముగింపు కార్యక్రమంలో కోచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.



కోచ్ సత్యనారాయణతో బాలికల జట్టు

లక్కీ లక్ష్మి ఉత్సవాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దసరా, దీపావళి సమయంలో ఆభరణాలు, వెండి వస్తువుల కొనుగోలును ప్రోత్సహించేందుకు లక్కీ లక్ష్మి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని అఖిల భారత జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ ప్రకటించింది. నగర పరిధిలోని అన్ని ప్రముఖ నగల దుకాణాల్లో అక్టోబరు 22 నుంచి డిసెంబరు 9 వరకు చేసే కొనుగోళ్లపై వినియోగదారులకు బహుమతులు అందిస్తామని సమితి అధ్యక్షుడు సాయ్యామ్ మెహ్రా వెల్లడించారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో సమితి ప్రతినిధులు కమల్ సింఘానియా, మనోజ్ ఝా, సురేశ్ ధ్రువ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. 'గెట్ బ్లెస్డ్- బీ లక్కీ' పేరిట అన్ని ఆభరణ విక్రయ దుకాణాల్లో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు.



బంగారు నాణేలను ప్రదర్శిస్తున్న సమితి ప్రతినిధులు, కావ్యా మనోహర్ శెట్టి

ఉద్యోగుల సంఘానికి పాలనాధికారి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి కేఏఎస్ అధికారి సీఎన్ మంజునాథ్‌ను పాలనాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఆహార, పౌర సరఫరాల శాఖలో జనరల్ మేనేజర్‌గా సేవలు అందిస్తున్నారు. సంఘానికి కొత్త పాలక మండలి ఏర్పాటయ్యే వరకు మంజునాథ్ పాలనాధికారిగా సేవలు అందించనున్నారు.

యువకుడి హత్యకేసులో మహిళ అరెస్ట్

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన శరణప్ప మస్కి అనే యువకుడ్ని హత్య చేసిన భాగ్యశ్రీ (30) అనే మహిళను కుష్టగి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సెప్టెంబరు 30న ఒంటిపై కాలిన గాయాలతో శరణప్ప మృతదేహం లభించింది. దర్యాప్తు పూర్తి చేసి బెళగావి జిల్లా ముగళఖోడ గ్రామానికి చెందిన నిందితురాలిని, హత్యకు సహకరించిన ఇబ్రహీం అనే యువకుడ్ని అరెస్టు చేశారు. భాగ్యశ్రీ భర్త నాలుగేళ్ల క్రితం మరణించారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వీడియోలు చేసుకుంటున్న ఆమెకు ఏడాది క్రితం శరణప్ప పరిచయం అయ్యాడు. అప్పుడప్పుడు వీరిద్దరూ హిరేమన్నాపుర గ్రామంలో భేటీ అయ్యేవారు. ఇద్దరూ సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియోలు, ఫొటోలను తమ చరవాణుల్లో భద్రపరుచుకున్నారు. ఇదే సమయంలో హిరేమన్నాపుర గ్రామంలో ఇబ్రహీంతో భాగ్యశ్రీ పరిచయం అయింది. శరణప్పను అంతం చేస్తే తాము కలిసి ఉండవచ్చని ఇద్దరూ కలిసి అతని ఇంట్లోనే దాడి చేసి హత్య చేశారు. ఒంటికి నిప్పంటించి పరాయ్యారు. శవం పూర్తిగా కాలకపోవడంతో అతి ఆత్మహత్యో, హత్యో తక్షణమే గుర్తించలేకపోయారు. దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

చెక్‌పోస్టులపై దాడులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : సరుకుల రవాణాలో ఉన్న వాహనాల నుంచి లంచాలు తీసుకుంటున్నారని వస్తున్న ఆరోపణలపై బీదర్, బళ్లారి, కోలారు జిల్లాల్లోని చెక్‌పోస్టులపై లోకాయుక్త పోలీసులు మంగళవారం ఏకకాలంలో దాడులు చేశారు. రాత్రి పొద్దుపోయేంత వరకు సోదాలు కొనసాగాయి. హుమ్నాబాద్, పీడీ హళ్లి, శ్రీనివాసపుర తాలూకా తాడిగోల క్రాస్ వద్ద ఉన్న చెక్‌పోస్టులపై దాడి చేసిన అధికారులు లెక్కలోకి రాని నగదును జప్తు చేసుకుని, దస్త్రాలను స్వాధీనపరుచుకున్నారు.

అందులో వాస్తవం లేదు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తల్లి దండ్రులు లేని అనాధ విద్యార్థుల ఖాతాకు ఏడాదికి రూ. 24 వేల స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం ఇస్తోందని తప్పుడు సర్క్యులర్ ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోందని జిల్లా పాలన యంత్రాంగం గుర్తించింది. అలాంటి స్కాలర్‌షిప్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడం లేదని డీసీ దయానంద్ స్పష్టం చేశారు. మోసపూరిత ప్రకటనను విశ్వసించి వెబ్‌సైట్లు, లింకుల్లో వివరాలు నమోదు చేయవద్దని ఆయన విద్యార్థులకు సూచించారు.

నిందితుల అరెస్టు

రామనగర, న్యూస్‌టుడే : కగ్గలిపుర ఠాణా పరిధి మైత్రి లేఅవుట్‌లో గంగాంబిక విశ్వనాథ్ సంసుది అనే మహిళ నివాసంలో దొంగతనానికి పాల్పడిన ఆనంద (28), ఆయన భార్య ఇందుశ్రీ (20)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 3.30 లక్షల విలువైన ఆభరణాలను జప్తు చేసుకున్నారు. ఆనంద వృత్తి రీత్యా ఆటో డ్రైవరు. తమ అప్పులను తీర్చుకునేందుకు, ఇతర ఖర్చుల కోసం వీరు దొంగతనానికి పాల్పడ్డారని ఎస్పీ కార్తిక్ రెడ్డి తెలిపారు.

సామాజిక మాధ్యమాల ఖాతాల హ్యాక్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మాజీ మంత్రి బి. శ్రీరాములు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు హ్యాక్ అయ్యాయి. తన ఖాతాలు హ్యాక్ అయ్యాయని, తన పేరిట ఎవరైనా నగదు కావాలని కోరితే, అందుకు స్పందించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువకునికి కత్తిపోట్లు

గదగ, న్యూస్‌టుడే : తన చెల్లిని ప్రేమిస్తున్న జాఫర్ జమాదార (25) అనే యువకుడిపై రుహాన్ అనే యువకుడు కత్తితో దాడి చేశారు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించారు. దోభీ ఘాట్ సమీపంలోని టీస్టాల్‌కు తన స్నేహితుడు దాదాపీర్‌తో కలిసి వచ్చి జాఫర్‌తో గొడవ పడి కత్తితో పొడిచాడు. రుహాన్ పరారీ కాగా, దాదాపీర్‌ను శహర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు.

ముగ్గురిని అరెస్టు చేశాం

మంగళూరు, న్యూస్‌టుడే : మాజీ ఎమ్మెల్యే మొయినుద్దీన్ బావా సోదరుడు ముమ్తాజ్ అలి బలవన్మరణానికి సంబంధించి ఆయేషా అలియాస్ రెహమత్, ఆమె భర్త శోయబ్, సహ నిందితుడు సిరాజ్‌లను అరెస్టు చేశామని నగర పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు. మరో ముగ్గురు కేరళలో తలదాచుకున్నట్లు గుర్తించి, గాలింపు కొనసాగించామని తెలిపారు.

తహసీల్దారుకు షోకాజ్ నోటీసులు

కార్వార, న్యూస్‌టుడే : జిల్లాధికారి పేరు దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై భట్కళ తహసీల్దార్ డాక్టర్ నయనకు నోటీసులు జారీ అయ్యాయి. భట్కళ, మురుడేశ్వర వద్ద సముద్ర తీరానికి పర్యాటకుల రాకపై నిషేధాన్ని విధిస్తూ డాక్టర్ నయన ఆదేశాలు జారీ చేశారు. తన దృష్టికి తీసుకురాకుండా, జిల్లాధికారి తరపున ఆదేశాలు జారీ చేయడాన్ని ప్రశ్నిస్తూ డీసీ లక్ష్మీప్రియ నోటీసులు జారీ చేశారు.

అమృతహళ్లిలో వ్యక్తి హత్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇక్కడ అమృతహళ్లి పోలీసుఠాణా పరిధిలోని జక్కూరు రహదారిలో మోహన్‌కుమార్(45)ను గుర్తు తెలియని దుండగులు హత్య చేసి పరారైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్న హతుడు, బంగారు నగలకు సంబంధించి ఓవ్యక్తితో గొడవపడ్డాడని, ఆవ్యక్తి హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

దుకాణాలపై దాడులు, సోదాలు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : విద్యాసంస్థలు, ఆలయాలకు సమీపంలో పొగాకు, అనుబంధ ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలపై జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి సిగరెట్లు తదితరాలను విక్రయిస్తున్న దుకాణదారులపై 22 కేసులు నమోదు చేసి, రూ. 2500 జరిమానా విధించామని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. చిక్కబళ్లాపుర నగరవీధుల్లో, విద్యాసంస్థల వద్ద పొగాకుతో ఎదురయ్యే సమస్యలను అధికారులు, వైద్యులు వివరించారు. అధికారులు డాక్టర్ మంజుళ, నారాయణ స్వామి, గంగాధర, సామాజిక కార్యకర్త మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అతివేగంగా సంచరిస్తున్న వాహనం రహదారిదాటుతున్న పాదచారిని ఢీకొనడంతో ఆవ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున హెబ్బాళ్ సంచార పోలీసుఠాణా పరిధిలో జరిగింది. 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన మృతుడి ఊరు, పేరు తదితర వివరాలు తెలియరాలేదు. సహకార నగర రైల్వే కింద వంతెన వద్ద సంఘటన జరిగినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎం. ఎస్. రామయ్య ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుని మృతి

కోలారు, న్యూస్‌టుడే : హొగళగెరె క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మ (48), ఆమె కుమారుడు రఘు అక్కడికక్కడే మరణించారు. శ్రీనివాసపుర నుంచి బైకులో వెళుతున్న సమయంలో వీరి బైకును అపరిచిత వాహనం ఢీకొనడంతో వీరిద్దరూ మృతి చెందారు. శ్రీనివాసపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విరిగిపడిన కొండ చరియలు

చిక్కమగళూరు : నిరంతరం కురుస్తున్న వర్షాలతో చార్మాడిఘాట్‌లో కొండచరియలు విరిగి పడ్డాయి. కొట్టిగెహార, బాళూరు, బణకల్ ప్రదేశాల్లో వాహన సంచారం మందగమనంతో సాగుతోంది. రహదారి ప్రాధికార సిబ్బంది, కార్మికులు రహదారి పైన పడిన మన్ను, బండరాళ్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

మోసపోయిన రైతు

బీదర్ : ప్రభుత్వ ఉద్యోగం ఉంటే తన కుమారునికి త్వరగా వివాహమవుతుందని సంభాజి లెండి వినర్ అనే రైతు భావించారు. కుమారునికి 39 ఏళ్లు రావడం, ఉద్యోగం లేకపోవడంతో ఆయన నిత్యం వ్యధకు గురయ్యారు. మీ కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని వంచకులు చెప్పడంతో రెండు ఎకరాలు విక్రయించి రూ. 7 లక్షలను వంచకులకు ఇచ్చి మోసపోయారు. నగదు ఇచ్చిన అనంతరం వంచకులు పరారీ కావడంతో ముందరగి ఠాణాలో ఆయన ఫిర్యాదు చేశారు.

బోనులో పడిన చిరుత

రామనగర : కనకపుర తాలూకా దొడ్డమరళవాడి సమీపంలోని మరసనహళ్లి వద్ద అటవీశాఖ సిబ్బంది ఉంచిన బోనులో చిరుత పడింది. నెల రోజులుపైగా చుట్టుపక్కల గ్రామాల్లోని పెంపుడు జంతువులు, జాగిలాలపై చిరుత దాడి చేసి చంపుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. గాయపడి, బోనులో పడిన చిరుతకు చికిత్స చేసి తరలించామని అటవీశాఖ అధికారిణి పుట్టమ్మ తెలిపారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

జంబూసవారీకి నగారా !


జంబూసవారీ నమూనా ప్రదర్శన వీక్షిస్తున్న అధికారుల బృందం

మైసూరు : విఖ్యాత దసరా ఉత్సవాలు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయి. అక్టోబరు 12న సాయంత్రం శుభ కుంభలగ్నంలో జంబూ సవారీ ప్రారంభించేందుకు సకలం సిద్ధం చేస్తున్నారు. ఏనుగులకు పుష్పార్చన చేసేందుకు ప్యాలెస్ ముందు వేదికను నిర్మించారు. నిత్యం 750 కిలోల బరువుతో తాలీమ్‌లో పాల్గొంటున్న అభిమన్యు, కుమ్కి అనే ఏనుగులు హిరణ్య, లక్ష్మి, ధనంజయ, గోపితో పాటు అశ్విక దళం, పోలీసు బ్యాండు, పోలీసు కవాతుదళం బుధవారం మరో విడత అభ్యాస ప్రక్రియను నిర్వహించాయి. ఏనుగులు ఎటువంటి బెదురు లేకుండా ప్యాలెస్ నుంచి నగర వీధుల్లో సంచరించాయని అటవీశాఖ అధికారి డాక్టర్ ప్రభుగౌడ తెలిపారు.

గిరిధామం కిటకిట

మైసూరు : దేశ విదేశాల నుంచి వస్తున్న భక్తులు, పర్యాటకులు చాముండికొండపైకి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పండగ సెలవులు వస్తున్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించుకుని, ముడుపులు చెల్లించి వెళుతున్నారు. అమ్మవారికి ఒక్కో రోజు ఒక్కో అలంకరణ చేస్తున్నారు. నిత్యం సాయంత్రం ఐదు గంటలకు ఆలయం ఆవరణలో అర్చకులు చాముండేశ్వరి దర్బార్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. నాడదేవతకు భాజపా నాయకుడు బసనగౌడ పాటిల్ యత్నాళ్ బుధవారం పూజ చేసుకుని వెళ్లారు. బెట్టపై ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించారు.


చాముండి కొండపై భక్తుల దండు

కిత్తూరు వీర రాణి.. సాహస చరితకే పారాణి


కిత్తూరు పాలకులు, సైనికుల దుస్తులు


చెన్నమ్మ సాహసాన్ని తెలిపే ఓ చిత్తరువు


సైనికులు ఉపయోగించిన ఆయుధాలు

బెళగావి, న్యూస్‌టుడే : సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు బ్రిటిష్ వారితో పోరాడిన వీర రాణి చెన్నమ్మ స్వాతంత్ర్య సమరయోధురాలిగా చరిత్ర పుటల్లో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. సైన్యాధిపతి సంగొళ్లి రాయణ్ణతో కలిసి బ్రిటిష్ సైనికులను ఆమె ముప్పుతిప్పలు పెట్టి, మూడు చెరువుల నీరు తాగించడం ఓ చరిత్ర. భారత్‌లో సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న సమయంలో బ్రిటీషర్లను మొదటిసారిగా చెన్నమ్మ నిలువరించడం సాహసఘట్టాల సమాహారమే. ఆమె చేసిన పోరాటానికి రెండు శతాబ్దాలు నిండాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23-25 వరకు కిత్తూరు ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసుకుంటోంది. కిత్తూరు రాణి చెన్నమ్మ పోరాటాన్ని, అప్పటి సైనికులు, ప్రజల దుస్తులు, జీవనశైలిని తెలిపేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ మ్యూజియాన్ని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1967 జనవరి 10న ప్రారంభించారు. పురవాస్తు శాఖ ఈ వస్తు సంగ్రహాలయాన్ని నిర్వహిస్తోంది. నాటి ముఖ్యమంత్రి ఎస్ఆర్ కంఠి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాలుగు గ్యాలరీల్లో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. కిత్తూరు సంస్థానానికి చెందిన వస్తువులు ఒక విభాగంలో చూడొచ్చు. చెన్నమ్మ వర్ణ చిత్రాలు మరో భవంతిలో అమర్చారు. మరో రెండు గ్యాలరీల్లో శిల్పాలు, ఆయుధాలు, పాతకాలం తాళాలు, ఆభరణాలు, కంకణాలు, ఫిరంగి గుండ్లు, కుండలు, కిత్తూరు రాజుల వంశవృక్షం, శాసనాలు తదితరాలను ఆవిష్కరించారు. యుద్ధానికి వెళుతున్న కిత్తూరు సైన్యం, సైన్యానికి నేతృత్వం వహిస్తున్న సంగొళ్లి రాయణ్ణ, బ్రిటిష్ సైనికులను బంధించి తీసుకువెళ్లడం, బ్రిటిష్ పిల్లలతో రాజప్రాసాదంలో రాణి చెన్నమ్మ ఆడుకుంటూ ఉన్న చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. విద్యార్థులు, చరిత్రకారులు, స్థానికులతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ మ్యూజియానికి వచ్చి వెళుతున్నారు. గత ఏడాది 65 వేల మంది ఇక్కడకు వచ్చారు. కిత్తూరు ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో మ్యూజియానికి సందర్శకులు వస్తారని అంచనా వేసుకున్నామని క్యూరేటర్ రాఘవేంద్ర ధీమా వ్యక్తం చేశారు. వారంలో అన్ని రోజులూ తెరచి ఉండే ఈ మ్యూజియం ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సందర్శించే వీలు కల్పించారు. బాలలకు రూ.5, పెద్దలకు రూ.10 చొప్పున టికెట్ ధర ఉండగా.. ప్రతి నెలా రూ.60 వేలు టికెట్ల రూపంలోనే ఆదాయం వస్తున్నట్లు రాఘవేంద్ర వివరించారు.


రాణి చెన్నమ్మ సాహస ఘట్టాలు వీక్షిస్తున్న విద్యార్థులు



హుబ్బళ్లి నడిబొడ్డున రాణి చెన్నమ్మ కూడలి

ఉపాధ్యాయుడిని బెదిరించిన .. ఇద్దరి అరెస్టు

రాయచూరు, న్యూస్‌టుడే : సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడిని బ్లాక్ మెయిల్ చేసిన నలుగురిపై రాయచూరు తాలూకా యరగేరా పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది. ఇద్దరిని అరెస్టు చేశారు. వీరిలో నకిలీ విలేకరి ఒకరు ఉండటం గమనార్హం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విజయపుర జిల్లాకు చెందిన సురేంద్ర రాయచూరు తాలూకా తలమారిలో ఉపాధ్యాయుడిగా పనిచేసే వారు. ఇతడు అతిథి ఉపాధ్యాయురాలుతో గొడవ పడిన కారణంగా సస్పెండ్ అయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాయచూరుకు చెందిన పరశురామ్, నరసింహులు, రాము, నరసప్ప అనే నలుగురు యరగేరాలో నివాసం ఉంటున్న సురేంద్ర ఇంటికి ఈ నెల 3న వెళ్లారు. సస్పెండ్ అయిన విషయంపై పత్రికల్లో ప్రచురించి పరువు తీస్తామని బెదిరించారు. అలా జరగకుండా ఉండాలంటే రూ.10 లక్షలు ముట్టజెప్పాలని డిమాండ్ చేశారు. తన వద్ద అంత డబ్బు లేదని సురేంద్ర చెప్పడంతో దాడి చేశారు. అతడి భార్య ఒంటిపైన ఉన్న బంగారు ఆభరణాలు, దాచుకున్న రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు ఫోన్ చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. దాంతో సురేంద్ర పోలీసులను ఆశ్రయించారు. నగదు ఇస్తానని బాధితుడితో పోలీసులు ఈ నెల 7న బ్లాక్ మెయిలర్లకు ఫోన్ చేయించి యరగేరాకు పిలిపించారు. అక్కడికి వచ్చిన పరశురామ్ (నకిలీ విలేకరి), నరసింహులను అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

రాయచూరులో ఈనాడు

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతా నిర్వహిస్తారు. జిల్లా పాలనాధికారి కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. జిల్లా యంత్రాంగం, జిల్లా న్యాయసేవల ప్రాధికార, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, భారతీయ మనో వైద్య సంఘం సంయుక్తంగా నిర్వహిస్తుంది. ఆయా శాఖల ముఖ్యులు పాల్గొంటారు. ప్రముఖ వీధుల మీదుగా జాతా సంచరిస్తూ డీహెచ్ఓ కార్యాలయాన్ని చేరుకుంటుంది.

నియామకాల్లో దివ్యాంగులకు దక్కని ప్రాధాన్యం


వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న అధికారి

రాయచూరు, న్యూస్‌టుడే : దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని 'దివ్యాంగుల, పాలకుల ఒక్కూట జిల్లా సమితి' జిల్లా పాలనాధికారి నితీష్‌కు విజ్ఞప్తి చేసింది. జిల్లా అధ్యక్షుడు హొన్నప్ప గూళప్ప నేతృత్వంలో బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల రిమ్స్‌లో ఉద్యోగులను నియమించుకునేందుకు ఏజెన్సీకి టెండర్ ఆహ్వానించారని, నియమకాల్లో సామాన్య వర్గాలకు ప్రాధాన్యమిచ్చారని, దివ్యాంగులకు పూర్తి న్యాయం చేయలేదని ఫిర్యాదు చేశారు. వివిధ శాఖల్లో భర్తీ చేసుకునేటప్పుడు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. చదువుకున్న వికలాంగులకు ఉపాధి లభించక కుటుంబ నిర్వహణ కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పాలనాధికారి దివ్యాంగులకు న్యాయం జరిగేలా సమస్యను పరిష్కరించాలని, ఉదాశీనంగా వ్యవహరిస్తే ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు.

ఉద్యోగ సంఘం ఎన్నికల్లో పోటీ చేయాలి

రాయచూరు : ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో ఎన్‌పీఎస్ (నేషనల్ పింఛన్ సిస్టమ్) ఉద్యోగులు పోటీ చేయాలని, లేని పక్షంలో మనం చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్న ఉద్యోగులైన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఎన్‌పీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందకుమార్ కోరారు. ఆయన బుధవారం ఇక్కడి పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో కొంత మంది పేర్లు లేకపోవడం ఆశ్చర్యాన్ని కల్గిస్తోందన్నారు. ఉద్యోగుల సంఘం బైలా ప్రకారం సభ్యత్వం కోసం రూ.200 చెల్లిస్తున్నందున పేరు తప్పక ఉండాలన్నారు. అందరి పేర్లను చేర్చిన తర్వాతనే కొత్త జాబితాను ప్రకటించాలని ఒత్తిడి తెచ్చారు. ఎన్నికల ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు మల్లేష్ నాయక్, సురేష్, రహమాన్, సంతోష్, మడివాళప్ప పాల్గొన్నారు.


పాత్రికేయులకు వివరిస్తున్న ఆనందకుమార్

జయహే.. మహిషాసురమర్దిని


శాంతి స్వరూపిణిగా ముత్యాలమ్మ


వెంకన్న మూర్తికి అలంకరణ

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోంది. బ్రాహ్మణుల మంత్రాలు.. అమ్మవారి కీర్తనల ఆలాపనలు.. భక్తుల స్తోత్రాల మధ్య దసరా నవరాత్రి ఉత్సవాలు శోభిల్లుతున్నాయి. జగన్మాత, జగదాంబ, జగదీశ్వరి, జగత్ రక్షిణిగా వివిధ రూపాల్లో అమ్మవారు భక్త కోటిని కటాక్షిస్తోంది. విద్యుత్తు దీపాల అలంకరణతో దేవస్థానాలు మెరిసిపోతున్నాయి. ఏడో రోజు శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాలు చివరి దశకు చేరుతున్నందున భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. నిజలింగప్ప కాలనీ మిలినీయం ఉద్యానవనంలో నెలవైన భ్రమరాంబ.. సరస్వతీ రూపంలో నేత్రానందంగా తిలకించారు. గురువారం ఉదయం 9 గంటలపైన హోమం జరుగుతుందని కాలనీ ప్రముఖుడు సూర్యదేవర నాగేశ్వరరావు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించాలని కోరారు. గూడ్స్‌షెడ్ ప్రాంతంలో వెలసిన ముత్యాలమ్మ శాంతి స్వరూపిణిగా దర్శన భాగ్యం కల్పించింది. అల్లంప్రభు కాలనీ మాతా తాయమ్మ దేవి గుడి ఆవరణలో మహారాజ యువక మండలి ప్రతిష్ఠించిన సింహంపై అంబాభవానీ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది. ఉప్పారవాడిలో శ్రీమన్నారాయణుడికి గరుడ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఆలయంలోని వెంకన్నకు ప్రత్యేక అలంకరణ చేశారు. రాయచూరు తాలూకా దేవసూగూరు సూగూరేశ్వర కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాత రూపం కళ్లను కట్టి పడేస్తోంది. ఈ సందర్భంగా శక్తి దేవత మహత్యాన్ని తెలియపరిచే బాలల పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ఛత్రపతి శివాజీ తల్లి జీవన చరిత్ర, శివాజీకి భవానీమాత ఖడ్గాన్ని ఇచ్చిన సన్నివేశాల నటనకు ప్రేక్షకులు చప్పట్లు మోగించారు. కాంగ్రెస్ నాయకురాలు శశికళా నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఘనంగా యల్లమ్మదేవి విగ్రహం ఊరేగింపు

సిరివార, (మాన్వి) : పట్టణ సమీపంలోని యంకనగడ్డ క్యాంపు రోడ్డులో ఉన్న యల్లమ్మదేవి దేవస్థానంలో గురువారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి విగ్రహాన్ని పట్టణంలోని ఊరేగించారు. స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయం నుంచి దేవస్థానం వరకు ఊరేగింపు సాగింది. మహిళలు కుంభ కలశాలతో తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. దేవస్థానం జీర్ణోద్ధరణ కోసం అప్పటి ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ రూ.4 లక్షల విడుదల చేశారని సిరివార తాలూకా దళ్ అధ్యక్షుడు మల్లికార్జున బల్లటగి తెలిపారు. దీంతో ఆలయం పనులు పూర్తి చేసి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపన గౌడ, ప్రముఖులు ఆదర్శనాయక్, సూరిదురు గణ్ణనాయక్, అజిత్ హొన్నటగి, మౌలాసాబ్, కృష్ణాజీరావు, దేవేంద్రస్వామి, శివశరణ, కరియప్ప, బైరణ్ణనాయక్, పట్టణ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.


గరుడ సేవలో పాల్గొన్న భక్తులు


దేవసూగూరులో పౌరాణిక నాటకం


అమ్మవారి విగ్రహం ఊరేగింపులో భక్తులు

నిండుగా విపణి లోగిళ్లు.. జోరుగా కొనుగోళ్లు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మహానవమి, ఆయుధపూజకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. బూడిద గుమ్మడికాయలు, బంతిపూలు, బొరుగులు, బూందీ, మిఠాయిలు, నూతన దుస్తుల విక్రయాలతో బెంగళూరు మార్కెట్లు రద్దీగా మారాయి. గత వారం వరకు కిలో రూ.50 పలికిన బూడిద గుమ్మడికాయలు టోకున కిలో రూ.30కు అందుబాటులోకి వచ్చాయి. చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా బూడిద గుమ్మడికాయలు నగరానికి రావడంతో ధరలు కాస్త తగ్గాయి. బంతి, చేమంతి కిలో రూ.100కు చేరుకున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా గురు, శుక్రవారాల్లో ధరలు కొంత పెరిగే అవకాశం ఉంది. సెలవులు రావడంతో నగరవాసి తమ సొంతూళ్లకు బయలుదేరాడు. సొంత వాహనాల్లో వెళుతుండడంతో అన్ని టోల్‌గేట్ల వద్ద రద్దీ నెలకొంది. మైసూరు, ఇతర జిల్లాలు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళలోని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ రెండు వేలకు పైగా అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలను రెట్టింపు చేశాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద రద్దీ పెరిగింది. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగానే బొమ్మల కొలువులను ఏర్పాటు చేసుకున్నారు. తాము ఏర్పాటు చేసుకున్న బొమ్మల కొలువులను ఇరుగుపొరుగులు, స్నేహితులు, బంధువులను ఆహ్వానించి చూపుతున్నారు.


బొమ్మల కొలువు చూసేందుకు వచ్చిన యువతులు, మహిళలు

తపాలా ఉద్యోగుల జాతా



జాతాలో పాల్గొన్న ఉద్యోగులు

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాయచూరు తపాలాశాఖ నగరంలో జాతా నిర్వహించింది. తపాలాశాఖ పర్యవేక్షకుడు శివానంద జాతాను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా సంచాలకుడు దండప్ప బిరాదార్ మాట్లాడుతూ 150 ఏళ్లుగా ప్రజలకు మెరుగైన సేవలతో ప్రజల మన్ననలు అందుకుంటున్నట్లు ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని డిజిటల్ సేవలను విస్తరించడంలో ముందంజలో ఉందని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. శివానంద మాట్లాడుతూ 1874లో తపాలా సేవలు ఆరంభమయ్యాయని, ఏటా అక్టోబరు 9న దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లు వెల్లడించారు. ప్రధాన కార్యాలయం ముఖ్యుడు సంజయ్ లడ్డా, ఐపీపీబీ యోజన మేనేజర్ డాలి తమ్మినేని, ఉద్యోగులు శరణబసవ, నాగరాజ్ పాల్గొన్నారు.

కట్టుకున్నోడినే కడతేర్చింది

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : కుమారుడితో పాటు మరో ఇద్దరితో కలిసి ఆమె ఏకంగా భర్తను కడతేర్చిన సంఘటన బెంగళూరు మాదనాయకనహళ్లి పోలీసు ఠాణా పరిధిలో విషాదం నింపింది. వారి దాడిలో మునిరాజు (38) హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఆయన భార్య గీత (35), కుమారుడు హేమంత్, మరో ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆమె వేరొకరితో సన్నిహితంగా ఉండటంతో ఆయన తరచుగా గొడవకు దిగేవాడని గుర్తించారు. ఆ బాధతోనే మునిరాజు తాగుడుకు అలవాటు పడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన ఆయనపై నలుగురూ ఒకేసారి దాడి చేసి కడతేర్చాక, మృతదేహాన్ని హాళేగుడ్డదహళ్లి ప్రభుత్వ పాఠశాల వెనక ఓ పాత భవనంలో పడేశారని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలి


అధికారికి వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలోని సియాతలాబ్ కాలనీకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలని 'మాదిగ దండోరా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (పావగడ శ్రీరామ్ గుంపు) జిల్లా పాలనా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమరాజ్ అస్కిహాళ్, జిల్లా అధ్యక్షుడు నరసింహులు మర్చటాల్ నాయకత్వంలో సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్మికులు, కూలీలు అధికంగా నివసించే సదరు కాలనీలో ఆరోగ్య కేంద్రం లేక దూరంగా ఉండే రిమ్స్, ఒపెక్ ఆసుపత్రికి వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రోగుల సంఖ్య అధికంగా ఉండటం, ఆరోగ్య కేంద్రం లేకపోవడం వల్ల ప్రైవేటు ఆసుపత్రులు నెలకొల్పారని వివరించారు. పేదలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రతిపాదనలు పంపేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సూచించాలని కోరారు.

మక్కా ధర్వాజ్‌లో నేడు దసరా కవి గోష్ఠి

రాయచూరు, న్యూస్‌టుడే : విజయదశమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం బస్టాండ్ దగ్గర్లోని మక్కా ధర్వాజ్‌లో బహుభాషా కవి గోష్ఠి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని నగరసభ కమిషనర్ గురుసిద్ధయ్య హీరేమఠ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉర్దూ సాహితీవేత్త వహీద్ వాజీద్, తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్ బేవిన బెంచి, జిల్లా దళిత సాహిత్య పరిషత్ అధ్యక్షుడు తాయరాజ్ హాజరవుతారని, సాహితీవేత్త మహంతేశ్ మస్కి అధ్యక్షత వహిస్తారని వివరించారు. కవులు మహదేవ, దేవేంద్రమ్మ, డాక్టర్ షోహేబ్, రాణి డేవిడ్, లక్ష్మి మానస, వహాబ్ అజాద్, ఈరప్ప, డాక్టర్ వెంకటేష్, నరేంద్రనాథ్, సిద్ధలింగేశ్వర, కుమారి రజనీరెడ్డి పాల్గొంటారని వివరించారు. యల్లప్ప, బషీర్ అహ్మద్, జహిరుద్దీన్, బేగ్, కుమారి కళా, నరసప్ప కవిత్వాన్ని వినిపిస్తారని తెలిపారు.

వాల్మీకి జయంతిని ఘనంగా ఆచరిద్దాం


వాల్మీకి జయంతి పూర్వ సిద్ధతా సమావేశంలో అధికారులు

మాన్వి : మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాన్ని ఘనంగా ఆచరించాలని తీర్మానం చేశారు. బుధవారం తహసీల్దార్ రాజు ఫిరంగి అధ్యక్షతన పూర్వ సిద్ధతా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వాల్మీకి కూడలి వద్ద విగ్రహానికి ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పూలమాల వేసి ర్యాలీని ప్రారంభిస్తారన్నారని తహసీల్దార్ రాజు పేర్కొన్నారు. సరోటి వాహనంలో వాల్మీకి చిత్రపటాన్ని పట్టణంలోని ఊరేగిస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు తీసుకురావాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు సత్కారం, ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. తాలూకా పంచాయతీ ఉద్యానవనశాఖ స్థలంలో వాల్మీకి భవనం నిర్మించాలని పలువురు డిమాండ్ చేశారు. తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ఖాలిద్ అహ్మద్, పురపాలక సంఘం ముఖ్యాధికారి గంగాధర్, సమాజకల్యాణ అధికారి మహాలింగప్ప, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ శరణబసవపాటిల్, అధికారులు, శివరాజ్‌నాయక్, అయ్యప్పనాయక్, శరణబసవనాయక్, ప్రభురాజ్ కొడ్లి, హనుమేష్‌నాయక్, నరసింహనాయక్, అంజనేయనాయక్, రామణ్ణనాయక్ పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

09-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,993	2022
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,573	9,435
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	50.846

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు